

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శనివారం) : 6.23

సహరి (ఆదివారం) : 4.41


ఉష్ణోగ్రతలు

ప్రాంతం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	39.5	26.5
కావలి	38.0	26.0
కందుకూరు	38.0	28.0
ఆత్మకూరు	41.0	27.0
ఉదయగిరి	42.0	25.0

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీ పొట్టిశ్రీరాములు

నెల్లూరు

జిల్లా వార్తలు

శనివారం 6 ఏప్రిల్ 2024

జిల్లాలో మసకబారిన పోలీసు ప్రతిష్ట

కొత్త బాస్‌తోనైనా మార్పు వచ్చేనా!?



- వైసీపీ నేతలకు తొత్తులుగా కొందరు అధికారులు
- ప్రతిపక్ష నేతలే లక్ష్యంగా కేసులు, బెదిరింపులు
- ఎస్‌బీ కేంద్రంగా జారీ అవుతున్న ఆదేశాలు
- వివాదాస్పదంగా ఇద్దరు పోలీసుల తీరు
- కొత్త ఎస్పీ అయినా నిక్కచ్చిగా వ్యవహరించేనా!?

నెల్లూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పోలీసులు వ్యవహరిస్తున్న తీరు కొత్తగా చెప్పాల్సిన అవసరం లేదు. గడిచిన ఐదేళ్లగా గమనిస్తున్న వారికి కొందరు పోలీసు అధికారుల తీరు ఎలా ఉందో అవగత మవుతుంది. ప్రతిపక్ష పార్టీల నేతలే లక్ష్యంగా అక్రమ కేసులు, బెదిరింపులు, వీటిని నిరసిస్తూ ప్రతిపక్షాలు రోడ్డెక్కడం వంటి సంఘటనలను జిల్లా ప్రజానీకం చూసింది. మొన్నటిదాకా ఎస్పీగా పనిచేస్తున్న తిరుమలేశ్వరరెడ్డిని ఏకంగా ఎన్నికల కమిషన్ బదిలీ చేసిందంటే జిల్లాలో పోలీసు వ్యవస్థ వ్యవహార శైలి ఎలా ఉందో అర్థమవుతోంది. అయితే, ఎన్నికల కోడ్ వచ్చాక కొందరిలో మార్పు వచ్చింది. తటస్థంగా వ్యవహరిస్తున్నారు. మరి కొంత మంది మాత్రం తమ స్వామిభక్తిని చాటుకుంటూనే ఉన్నారు. కీలక పోస్టుల్లో తిష్ట వేసిన సదరు అధికారులు, వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రశాంతతకు, నిజాయితీకి మారుపేరుగా ఉన్న జిల్లాలో గతంలో అనేక మంది గొప్ప అధికారులు ఎస్పీలుగా పనిచేశారు. కానీ ప్రస్తుత పరిస్థితులతో జిల్లా ప్రతిష్ట మసకబారుతోంది. ఈ నేపథ్యంలో జిల్లాకు కొత్త ఎస్పీగా ఆరీఫ్ హఫీజ్‌ను ఎన్నికల కమిషన్ నియమించింది. మరి ఆయనైనా నిక్కచ్చిగా వ్యవహరిస్తారా!? ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు వైసీపీ భక్తులుగా మారిన పోలీసులపై దృష్టి పెడతారా? అన్నది చూడాలి.

● ఎస్‌బీలో వైసీపీ విధేయులు?

వైసీపీ నేతల మదిలోని ఆలోచనలు ఎస్పీ కళ్లుగా చెప్పుకునే స్పెషల్ బ్రాంచ్ నుంచి అమలవుతాయన్న ప్రచారం పోలీసు వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. ఎవరినైనా అరెస్టు చేయాలన్నా లేదా కేసులు పెట్టాలన్నా ఎస్‌బీ నుంచే ఆదేశాలు వెళుతాయన్న ఆరోపణలు ఉన్నాయి. అందుకు ప్రధాన కారణం గడిచిన ఐదేళ్లుగా వైసీపీకి వీరవిధేయులుగా వ్యవహరించిన ఇద్దరు పోలీసు అధికారులు ఎస్‌బీలో ఉండడమేనని చెప్పుకుంటున్నారు. ఇటీవల వీరు ఎస్‌బీలోకి రాగా అంతకముందు జిల్లాలో పలు స్టేషన్లలో పనిచేశారు. ఆ సమయంలో ప్రతిపక్ష నేతలే టార్గెట్ పనిచేశారు. అప్పట్లో ఈ అధికారులకు, ప్రతిపక్ష నేతలకు మధ్య అనేక మార్లు వివాదాలు కూడా జరిగాయి. అటువంటి వివాదాస్పద అధికారులను వివాద రహితమైన ఎస్‌బీలోకి తీసుకోవడంపై అనేక అనుమానాలు కలుగుతున్నాయి. ఎన్నికల నేపథ్యంలో ఈ అధికారులను ఎస్‌బీకు బదిలీ చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఎస్‌బీలో ఉన్న ఒక అధికారి వైసీపీ ప్రభుత్వంలో నాలుగన్నరేళ్లపాటు ఒకే మండలంలో పని చేయడం గమనార్హం. ఆయన అక్కడి నుంచి బదిలీ అయిన వెంటనే సొంత తమ్ముడిని తన పోస్టులోకి తీసుకురావడం విశేషం. ఆ మండలం వారి కుటుంబ పాలనగా మారిపోయిందంటూ సదరు మండల ప్రజలు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. తన కుటుంబానికి అండగా నిలిచిన ఆ ఎమ్మెల్యేకు ఎన్నికల్లో సహకారం అందించడం ఆ అధికారి బాధ్యతగా పెట్టుకున్నారని పోలీసు శాఖలో ప్రచారం జరుగుతోంది.

● పార్టీ మారితే ఇబ్బందులు


గడిచిన కొన్ని నెలలుగా వైసీపీ ఎమ్మెల్యేలు ఎన్నికలకు గ్రౌండ్ వర్కును ప్రిపేర్ చేసుకుంటూ వస్తున్నారు. అందులో ప్రధానమైంది తమకు అనుకూలమైన పోలీసు లను తమ పరిధిలో నియమించుకోవడమే. ఈ క్రమంలో రెండు నెలల క్రితం భారీగా ఎస్ఐల బదిలీ జరిగింది. ప్రతి మండలంలో వారికి అనుకూలరునే నియమించుకున్నారన్న ఆరోపణలు అప్పట్లోనే వెల్లువెత్తాయి. అలానే కీలకమైన పలు ఉన్నత పోస్టుల్లో కూడా ఒకే సామాజిక వర్గానికి చెంది, అనుకూలమైన వారిని తెచ్చి పెట్టుకున్నారు. అనుకున్నట్లుగానే వీరి చేత ప్రతిపక్ష పార్టీలను ఇబ్బందులు పెట్టేలా చేస్తున్నారని ప్రతిపక్ష నేతలు ఆరోపణలు చేస్తున్నారు. తెలుగు దేశం పార్టీలో చేరేందుకు అన్ని మండలాల్లోనూ నాయకులు ఆసక్తి చూపుతున్నారు. అయితే ఇటువంటి వారిని వైసీపీ నేతలు పోలీసుల అండతో బెదిరిస్తున్నట్లు తెలుస్తోంది. టీడీపీలో చేరిన వైసీపీ నాయకులను కూడా రకరకాల కేసులతో ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఇటీవల ముత్తుకూరు మండలంలోని ఓ నాయకుడు టీడీపీలో చేరారు. అయితే ఆ నాయకుడికి సంబంధించి ఓ భూమి వివాదం జరుగుతుండగా పోలీసులు జోక్యం చేసుకొని సదరు నాయకుడిని ఇబ్బందులు పెడుతున్నట్లు ఆ మండలంలో చర్చించుకుంటున్నారు. నెల్లూరు సిటీలో కూడా ఇటీవల ఓ టీడీపీ నాయకుడిని పాత కేసును అడ్డం పెట్టుకొని అరెస్టు చేశారు. ఇటువంటి పరిస్థితులు జిల్లా మొత్తం ఉన్నాయని, అయితే పోలీసులకు భయపడి బాధితులు బయటకు చెప్పుకోవడం లేదని తెలుస్తోంది.



సీఎం సభకు బస్సులు సిద్ధం..

జనానికి యుద్ధం!

● ప్రజలను తరలించేందుకు 500 ఆర్టీసీ బస్సులు?



నెల్లూరు (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి సిద్ధం సభ పుణ్యమా అని శనివారం జిల్లావాసులకు ఎర్రబస్సులు కరువు కానున్నాయి. జిల్లా వ్యాప్తంగా 70 శాతం బస్సులు కావలిలో జరిగే సిద్ధం సభకు జనాన్ని తోలడానికి వినియోగిస్తున్నారు. దీంతో అంతర్గత సర్వీసులన్నీ దాదాపుగా రద్దు కానున్నాయి. ఇంకేముంది.. ప్రజలు తమ ప్రయాణాలు వాయిదా వేసుకోవడమో లేదా ప్రత్యామ్నాయ వాహనాలను ఆశ్రయించడమో తప్ప మరోమార్గం కనిపించని పరిస్థితులు నెలకొననున్నాయి. జిల్లా పరిధిలో మొత్తం 680 ఆర్టీసీ బస్సులు ఉండగా, నేటి సిద్ధం సభకు 500లకుపైగా బస్సులు కేటాయించినట్లు సమాచారం. అయితే, 300 బస్సులను కేటాయించినట్లు అధికారులు అధికారికంగా చెబుతున్నారు.

● అంతర్గత సర్వీసులు రద్దు

సిద్ధం సభకు కేటాయించిన బస్సుల సంఖ్యను అంచనా వేస్తే శనివారం జిల్లా అంతర్గత సర్వీసులన్నీ దాదాపుగా రద్దు కానున్నట్లు తెలుస్తోంది. మొత్తం బస్సుల్లో సిద్ధం సభకు పోను మిగిలే బుస్సుల సంఖ్య 180 నుంచి 200 వరకు ఉంటాయి. అవన్నీ జిల్లా నుంచి బయటి జిల్లాకు, రాష్ట్రాలకు నడిచే దూర ప్రయాణ బస్సులు. వీటిని రద్దు చేయడం కుదరదు. కాబట్టి సిద్ధం సభలకు కేటాయించగా మిగిలిన బస్సులు పక్క జిల్లాలు, రాష్ట్రాలకు నడపడానికి సరిపోతాయి. ఇక మిగిలేది 500 బస్సులే. వీటిని సిద్ధం సభకు కేటాయిస్తే జిల్లా పరిధిలో వివిధ ప్రాంతాలకు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రయాణ కష్టాలు తప్పేలా లేవు.

● లాడ్జీల యజమానులపై ఒత్తిడి

కావలి: "మీరు ఎన్నైనా చెప్పండి. సీఎం బందోబస్తు కోసం బయటి నుంచి పోలీసులు వస్తు న్నారు. వారికి రూములు ఇవ్వాల్సిందే'నంటూ పోలీస్ అధికారులు లాడ్జీల యజమానులపై ఒత్తిడి తెస్తున్నారు. ముందుగా రిజర్వు చేసుకున్నారని చెప్పినా వారు ససేమీరా అనడంతో ఏం చేయాలో దిక్కుతోచక తలలు పట్టుకుంటున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి శనివారం సాయంత్రం కావలిలో 'మేమంతా సిద్ధం' సభకు హాజరవుతున్నారు. సభ బందోబస్తుకు ఇతరప్రాంతాల నుంచి వచ్చే పోలీస్ అధికారులకు లాడ్జీలలో గదులు కేటాయించేందుకు స్థానిక పోలీస్ అధికారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ కావడంతో ముందుగానే లాడ్జీలను పలువురు రిజర్వు చేసుకున్నారు. అనుకోకుండా సీఎం సభ కావలిలో ఖరారు కావటంతో బందో బస్తుకు వచ్చే పోలీస్ అధికారులకు రూముల కోసం స్థానిక పోలీస్ అధికారులు లాడ్జీల యజమానులు, నిర్వహకులపై ఒత్తిడి తెచ్చారు. ముందుగానే రిజర్వు అయిపోయాయని వారు మొత్తుకుంటున్నా వాళ్లు ససేమీరా అంటున్నారు. అవన్నీ తమకు సంబంధం లేదని, గదులు కావాల్సిందేనంటూ ఒత్తిడి చేయడం, పైగా ఆ రూములు కూడా ఉచితంగా ఇవ్వాల్సి ఉండటంతో లాడ్జీల యజమానులు తలలు పట్టుకుంటున్నారు.

● 1.5లక్షల మంది జనసమీకరణ

పట్టణ బైపాస్‌రోడ్డుకు తూర్పున ఉన్న లేఅవుట్లలో సభకు అవసరమైన ఏర్పాట్లను చేస్తున్నారు. 1.5 లక్షల మంది ప్రజలు వస్తారనే అంచనాతో గ్యాలరీలు ఏర్పాటు చేశారు. కాగా, సభా ఏర్పాట్లను శుక్రవారం మధ్యాహ్నం గుంటూరు ఐజీ త్రిపాఠీ, ఎస్పీ హఫీజ్ పరిశీలించారు. అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. సీఎం బందోబస్తుకు 1200 మంది పోలీస్ అధికారులు, సిబ్బందిని నియమించగా, వారంతా శుక్రవారం ఉదయానికే కావలికి చేరుకున్నారు.

నేటి నుంచి ఎస్ఏ-2 పరీక్షలు

● 19వతేదీ వరకు నిర్వహణ

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 5 : పాఠశాల స్థాయిలో జరిగే సమ్మెటివ్ అసెస్‌మెంట్-2(వార్షిక పరీక్షలు) శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. 6 నుంచి 9వ తరగతి వరకు వివరణాత్మక విధానంలో జిల్లా విద్యాశాఖ పర్యవేక్షణలో ఈ పరీక్షలు జరగనున్నాయి. జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్యా పాఠశాలల్లో 1 నుంచి 9వతరగతి వరకు, ప్రైవేట్ యాజమానాల్లో 6 నుంచి 9వతరగతి వరకు ఎస్‌సీఈఆర్టీ ద్వారా జారీ చేయబడిన ప్రశ్నపత్రాలతో మాత్రమే ఈ పరీక్షలు నిర్వహించాలని విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

స్వల్పమార్పులతో నిర్వహణ...

మారిన విద్యావిధానాలకు అనుగుణంగా స్వల్పమార్పు లతో ఎస్ఏ-2 పరీక్షలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. 1 నుంచి 8వతరగతి వరకు విద్యార్థులకు క్లాస్‌రూమ్ బేస్డ్ అసెస్మెంట్ (సీబీఏ)ను నిర్వహిస్తారు. 9వ తరగతి విద్యార్థులకు మాత్రం 10వతరగతి మాదిరిగానే ఎస్ఏ-2 పరీక్షలు జరగనున్నాయి. క్లాస్‌రూమ్ బేస్డ్ అసిస్మెంట్‌కు ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల విద్యార్థులకు ప్రశ్నపత్రంతోపాటు ఓఎంఆర్ షీట్ అందిస్తారు. వీరిలో కూడా 1 నుంచి 5వతరగతి వరకు అన్ని సబ్జెక్టులకు కలిపి ఒక ఓఎంఆర్, 6, 7, 8 తరగతులకు లాంగ్వేజ్ పరీక్షలకు ఒక ఓఎంఆర్, నాన్ లాంగ్వేజ్ పరీక్షలకు మరో ఓఎంఆర్ షీట్ అందిస్తారు. ప్రైవేట్ యాజమాన్య పాఠశాలల విద్యార్థులకు మాత్రం కేవలం ప్రశ్నపత్రాలను మాత్రమే అందిచనున్నారు. ఆ పత్రంలో అబ్జెక్టివ్ తరహా ప్రశ్నలతోపాటు డిస్క్రిప్టివ్ తరహా ప్రశ్నలు కూడా ఇస్తారు. విద్యార్థులు జవాబులను ప్రశ్నపత్రంలోనే టిక్ చేయాలి, రాయాలి. అలాగే ఓఎంఆర్‌లో బబుల్ చేయాలి. 9వతరగతి విద్యార్థులకు ఎస్ఎస్‌సీ పబ్లిక్ పరీక్షల మాదిరిగా ప్రశ్నపత్రాలు 100 మార్కులకు ఉంటాయి. కాగా, ఈ పరీక్షలకు సంబంధించి పాఠశాల విద్యాశాఖ షెడ్యూల్ విడుదల చేసింది. 1 నుంచి 8వతరగతి వరకు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, 9వతరగతి విద్యార్థులకు ఉదయం 9 నుంచి 12.15 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. ప్రతిరోజూ ఎమ్మార్సీ నుంచి ఉపాధ్యాయులు సంబంధిత ప్రశ్నపత్రాలను గంట ముందు పాఠశాలలకు అందిస్తారని డీఈవో రామారావు తెలిపారు.



బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న కలెక్టర్

జగ్జీవన్‌రామ్ జీవితం స్ఫూర్తిదాయకం

● జిల్లా కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు (వీఆర్సీ) ఏప్రిల్ 5 : స్వాతంత్ర్య సమరయోధుడు, భారత ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ పేద బడుగు బలహీనవర్గాల ప్రజలకు తన జీవితం త్యాగం చేశారని, ఆయన జీవితం నేటితరానికి స్ఫూర్తిదాయకమని కలెక్టర్ హరినారాయణన్ కొనియాడారు. శుక్రవారం జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా నగరంలోని వేదాయపాళెం కూడలిలోని ఆయన విగ్రహానికి కలెక్టర్ పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రమేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కలెక్టరేట్‌లో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి డీఆర్వో లవన్న పూలమాలలు వేసి, శ్రద్ధాంజలి ఘటించారు.

సంగమేశ్వరుడి ఉత్సవాలకు అంకురార్పణ

సంగం, ఏప్రిల్ 5: సంగమేశ్వరుడి బ్రహోత్సవాల్లో భా గంగా మొదటిరోజు ఉదయం స్వామికి అంకురార్పణ పూజ కార్యక్రమంను వైభవంగా నిర్వహించా రు. ఈ సందర్భంగా వేదపండితులు పెన్నా నది జలాలతో అభిషేకాలు చేశారు. అనంతరం వేద మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ అంకురార్పణ చేపట్టారు. కార్యక్రమానికి ప్రధాన అర్చకులు టంగుటూరి గోపాలకృష్ణమూర్తి, వెంకటలక్ష్మీ దంపతులు ఉభయ కర్తలుగా వ్యవహరించారు. భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మార్కెట్ కమిటీలు నిర్వీర్యం!

- ఏళ్ల తరబడి పేరుకుపోయిన బకాయిలు
- గోదాములకు అందని అద్దె
- సివిల్ సప్లయీస్ నుంచే రూ.4.62 కోట్ల పెండింగ్

నెల్లూరు (వ్యవసాయం), ఏప్రిల్ 3 : పంటలపై వసూలు చేసే 2 శాతం సెస్సు, గోదాముల అద్దెలపైనే వ్యవసాయ మార్కెట్ కమిటీల (ఏఎంసీ) ఆదాయం ఆధారపడి ఉంటుంది. ఇలా వచ్చే ఆదాయంతోనే సిబ్బంది జీతాలు, కమిటీ అభివృద్ధి, పాలవర్గ సభ్యులకు గౌరవ వేతనాలు, విద్యుత్ బిల్లులు, అదనపు గోదాముల నిర్మాణం ఇతరత్రా నిర్వహణ జరుగుతుంటుంది. అయితే కొన్నేళ్లుగా గోదాముల అద్దె బకాయిలు రూ.కోట్లలో పేరుకుపోవడంతో నిర్వహణ కష్టంగా మారుతోంది. ఎప్పుడూ వ్యాపారాలతో కళకళలాడే వ్యవసాయ మార్కెట్ కమిటీలు పాలకవర్గం నిర్లక్ష్యం కారణంగా మనుగడే కష్టంగా మారుతోంది. కేవలం రాజకీయ పునరావాస కేంద్రాలుగా మారుతున్నాయనే భావన రైతుల్లో కలుగుతోంది.

● 8 ఏఎంసీలు.. 50 గోదాములు

జిల్లాలో నెల్లూరు, కోవూరు, కావలి, ఆత్మకూరు, ఉదయగిరి, కందుకూరు, సర్వేపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉన్నాయి. ఈ 8 కమిటీల పరిధిలో 50 గోదాములు ఉండగా, దాదాపు 57,650 మెట్రిక్ టన్నుల వరకు వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేసుకోవచ్చు. వెయ్యి మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన పెద్ద గోదాము ద్వారా నెలకు దాదాపు రూ.33వేలు, 600 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాము ద్వారా నెలకు రూ.16వేల నుంచి 18వేల వరకు ఆదాయం ఉంటుందని మార్కెటింగ్ శాఖ అధికారులు చెబుతున్నారు. అయితే ఆయా మార్కెట్ కమిటీల పరిధిలోని గోదాములను ఎక్కువగా పౌరసరఫరాల శాఖ అద్దెకు తీసుకుని బియ్యం నిల్వలు చేసుకుంటుంది. మరికొన్ని రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను దాచుకుంటారు. మరికొన్నింటిని గృహనిర్మాణ శాఖ అద్దెకు తీసుకుంది.

రూ.4.62 కోట్ల వరకు బకాయిలు

జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిధిలోని గోదాము లను అద్దెకు తీసుకున్న పౌరసరఫరాల శాఖ నుంచే అధికంగా బకాయిలు ఉన్నట్లు తెలుస్తోంది. గత కొన్నేళ్లుగా కమిటీలకు దాదాపు రూ.4.62కోట్ల అద్దె బకాయిలు రావాల్సి ఉంది. రాపూరు కమిటీకి రూ.24.5 లక్షలు, కందుకూరు కమిటీకి రూ.70.63లక్షలు, ఉదయ గిరిలో రూ.62.68 లక్షలు, అత్యధికంగా కావలి కమిటీకి రూ.3.04కోట్ల వరకు బకాయిలు పేరు కుపోయి ఉన్నాయి. మార్కెటింగ్‌శాఖ అధికారులు సంబంధిత శాఖ ఉన్నతాధికారులకు సమాచారం ఇస్తున్నారు. అయితే అప్పుడప్పుడు కొంత చెల్లిస్తున్నా బకాయిలు మాత్రం రూ.కోట్లలో ఉన్నాయి. దీం తో సిబ్బందికి వేతనాలు, గోదాముల నిర్వహణ కష్టత రమైందని పలువురు నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేగాక కమిటీకి సెస్సు రూపంలో వచ్చే ఆదాయంలో దాదాపు 45 శాతం ప్రభుత్వానికి జమ చేయాలన్న నిబంధన ఉండటంతో మార్కెట్ కమిటీలకు ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదని, కమిటీల అభివృద్ధిపై సభ్యులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని కేవలం రాజకీయ పునరావాస కేంద్రాలుగా మారుతున్నాయనే విమర్శలు వస్తున్నాయి.





నెల్లూరులోని విద్యుత్ భవన్

మేమేం తప్పు చేశాం

మా బకాయిలు ఇవ్వండి!

- విద్యుత్ సంస్థకు తేల్చి చెబుతున్న కాంట్రాక్టర్లు
- పర్సంటేజీల కోసం బడా కాంట్రాక్టర్లకు ఇస్తున్నారని ఆగ్రహం
- రూ.10 కోట్ల వరకు పెండింగ్!

నెల్లూరు (జడ్పీ), ఏప్రిల్ 5 : విద్యుత్ శాఖ చిన్న కాంట్రాక్టర్లకు షాక్ ఇస్తోంది. పనులు చేయించు కోవడంలో ఉన్న శ్రద్ధ బిల్లుల చెల్లింపుల్లో లేకపోవడంతో వారు లబోదిబో మంటున్నారు. పర్సంటేజీల కోసం బడా కాంట్రాక్టర్లకు ప్రాధా న్యత ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో అత్యవసర పనులను సైతం తాము చేయలేమని చేతులెత్తేస్తున్నారు. వేసవిలో అత్యవసర పనులు అయిన ట్రాన్స్‌పార్మటర్ల ఏర్పాటు, లైన్లు తదితర పనులు చేయించేందుకు అధికారులు నానా అవస్థలు పడుతున్నారు.

● రూ.పది కోట్లకుపైగా బకాయిలు

విద్యుత్ శాఖలో సబ్‌స్టేషన్ల నిర్మాణాలు, పెద్ద పెద్ద లైన్ల ఏర్పాటు తదితర పనులను బడా కాంట్రాక్టర్లు చేస్తుంటారు. ట్రాన్స్‌పార్మర్ల ఏర్పాటు, విరిగిన స్తంభాల స్థానంలో కొత్త స్తంభాలు, త్రీఫేస్ లైన్ల ఏర్పాటు, కాలనీలు, రైతులకు విద్యుత్ సరఫరా పనులను జిల్లా పరిధిలో చిన్న కాంట్రాక్టర్లు చేస్తుంటారు. జిల్లాలో దాదాపుగా 35 నుంచి 40 మంది వరకు కాంట్రాక్టర్లు ఏళ్ల తరబడిగా ఈ పనులు చేస్తున్నారు. అయితే, వీరికి గడిచిన ఆర్నెల్లుగా బకాయిలు ఆపేసినట్టు సమాచారం. ఒక్కో కాంట్రాక్టర్‌కు రూ.40 లక్షల నుంచి 50 లక్షల మేర బిల్లులు చెల్లించాల్సి ఉండగా, మొత్తంగా రూ.10 కోట్లకుపైగా బకాయిలు నిలిచి ఉన్నాయి. అయితే, గత సీఎండీ కొత్త ట్రాన్స్‌పార్మర్లు, కొత్త మీటర్లు అందజేసే ఏజెన్సీలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడంతోపాటు బడా కాంట్రాక్టర్లకు వెంటనే బిల్లులు మంజూరు చేస్తూ చిన్న కాంట్రాక్టర్లకు బకాయిలు పెడుతూ వచ్చాడని కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు.

● అత్యవసర పనులకు ఇబ్బందులు

వేసవి కావడం, ఎండలు మండుతుండటంతో విద్యుత్ వినియోగం భారీగా పెరిగిపోతోంది. దీంతో ట్రాన్స్‌పార్మర్లు, లైన్లపై అదనపు లోడు పడుతుండటంతో మరమ్మతులకు గురవుతున్నాయి. వెంటనే వాటి స్థానంలో వేరే పరికరాలను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించాల్సి ఉండగా బకాయిలు ఇవ్వనిదే పనులు చేయలేమని కాంట్రాక్టర్లు తెగేసి చెబుతున్నారు. దీంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటికైనా బకాయిలు మంజూరు చేస్తే తప్ప వేసవిలో నాణ్యతమైన విద్యుత్‌ను అందించే అవకాశం ఉండదని కాంట్రాక్టర్లు పేర్కొంటున్నారు.

రాష్ట్రాభివృద్ధి కోసమే ఎన్డీయేతో జత

● చంద్రబాబును సీఎంను చేసుకుందాం ● ఆత్మీయ సమావేశంలో ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి పిలుపు



టీడీపీ, బీజేపీ ఆత్మీయసమావేశంలో మాట్లాడుతున్న వేమిరెడ్డి

కావలి, ఏప్రిల్ 5 : రాష్ట్రాభివృద్ధి కోసమే టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు బీజేపీతో జత కట్టి ఎన్డీఏ కూటమిలో చేరారని ఆ కూటమి నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. టీడీపీ, బీజేపీ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం శుక్రవారం కావలిలోని ఓ కల్యాణ మండపంలో జరి గింది. ఈ సందర్భంగా వేమిరెడ్డి మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ మూడు పార్టీలు కలిసి కూటమిగా ముందుకు వెళ్లటం రాష్ట్రాభివృద్ధికి దోహదపడుతుందన్నారు. నరేంద్ర మోదీ లాంటి ప్రధానమంత్రిని తాను చూడలేదని ఆయన పీఎం కావటం మనదేశ అదృష్టంగా చెప్పుకొచ్చారు. కేంద్రంలో తిరిగి ఎన్డీయే కూటమికి ఎలాంటి ఢోకా లేదన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ఒక బ్రాండ్ అని, ఆయన పేరు చెబితే ఇతర దేశాలలో కూడా ఒక ఇమేజ్ ఉందన్నారు. కూటమిలోని మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు అందరం కష్టపడి సైనికుల్లా పనిచేసి చంద్ర బాబును ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. కేంద్ర సహకారం ఉండటంతో పాటు చంద్రబాబు కు ఉన్న ఇమేజ్‌తో ఇతర దేశాల నుంచి పారిశ్రామిక వేత్తలు వస్తారని అన్నారు. ఎంపీగా తనను, ఎమ్మెల్యేగా కావ్య క్రిష్ణారెడ్డిని గెలిపించాలని ఆయన కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ ఈ రాష్ట్రాన్ని బాగు చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంద న్నారు. బ్రహ్మ, విష్ణు ఈశ్వరుడు కలియికతో రాష్ట్రంలో రాక్షస పాలనను అందరం కలిసి తరిమి కొట్టడానికి సిద్ధం కావాలన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నేతలు వంశీధర్‌రెడ్డి, సురేంద్ర రెడ్డి, వాకాటి నారాయణరెడ్డి, కందుకూరు సత్యనారాయణ, ఆర్డీ విల్సన్, కంచర్ల మురళీధర్‌నాయుడు, కమల, సీపీసీ సత్యం, కామాక్షమ్మ, ప్రసన్న, పూనూరు మాధవి, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


అధికారులు స్వాధీనం చేసుకొని పోలీసులకు అప్పగించిన గ్రావెల్ టిప్పర్లు

ప్రభుత్వ భూములు, చెరువులే లక్ష్యం

- గ్రావెల్ కోసం బరితెగిస్తున్న మాఫియా
- ఫిర్యాదుతో ఎట్టకేలకు స్పందించిన యంత్రాంగం
- టిప్పర్లు, ఎక్స్‌కవేటర్ల స్వాధీనం

వెంకటాచలం (నెల్లూరు), ఏప్రిల్ 5 : ఈదగాలి, కంటేపల్లి, కాకుటూరు, చెముడుగుంట, రామదాసుకండ్రిగ, గొలగమూడి, అనికేపల్లి, వెంకటాచలం, సర్వేపల్లి, గూడ్లూరువారిపాళెం, ఎర్రగుంట, కసుమూరు, సర్వేపల్లి రిజర్వాయర్, కనుపూరు చెరువు ఇలా ఎక్కడపడితే అక్కడ గ్రావెల్ మాఫియా పేట్రేగిపోతోంది. ప్రభుత్వ, అటవీ భూముల్లోనూ ఎర్ర బంగారంగా పిలవబడే మట్టి భారీ యంత్రాలతో తవ్వి, సరిహద్దులు దాటించి సొమ్ము చేసుకుంటున్నారు. మరికొన్ని చోట్ల గోరంత అనుమతులు తీసుకుని కొండంతా తవ్వకాలు చేపట్టి ప్రైవేటు లేఅవుట్లకు తరలించి కోట్లాది రుపాయలు సంపాదించుకున్నారు. తెరవెనుక అధికార పార్టీలు ఈ తతంగమంతా నడుపుతున్నా వెంకటాచలం అధికారులకు చీమకుట్టినట్లు కూడా లేదు. ప్రతిపక్ష నాయకులతో కలిసి అనేక దఫాలు టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పోరాటాలు చేసినా అధికారుల్లో మాత్రం చలనం ఉండటంలేదు.

● టిప్పర్లు, ఎక్స్‌కవేటర్ల సీజ్

ఈదగాలి పంచాయతీ శ్రీకాంత్ కాలనీలో గత కొద్ది నెలలుగా రాత్రింబవళ్లు యధేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలు జరుగుతు న్నాయి. ముత్తుకూరుకు చెందిన వైసీపీ నేత కనుసన్నల్లో భారీ ఎక్స్‌కవేటర్లు, పదుల సంఖ్యలో టిప్పర్లు పెట్టి మరీ ప్రభుత్వ భూముల్లో గ్రావెల్‌ను కొల్లగొట్టడంతో లోతైన గుంతలు ఏర్పడ్డాయి. గతంలో అనేక మార్లు టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు ఆందోళనలు చేసినా అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడలేదు. అయితే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా ఆ నేత అధికార బలంతో గ్రావెల్ తవ్వకాలు కొనసాగిస్తున్నారు. అయితే, మట్టి తవ్వకాలపై ఉన్నతాధికారులకు శుక్రవారం ఫిర్యాదు అందడంతో ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, తహసీల్దారు పూర్ణచంద్రరావు స్వయంగా వెళ్లి పరిశీలించారు. నాలుగు టిప్పర్లు, భారీ ఎక్స్‌కవేటర్లను స్వాధీనం చేసుకుని, వెంకటాచలం పోలీసులకు అప్పగించారు. ఈ విషయాన్ని మైనింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు సైతం శుక్రవారం సాయంత్రం రెవెన్యూ అధికారులు, సిబ్బందితో కలిసి తవ్వకాలు జరిగిన ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. దీంతో ఎట్టకేలకు తవ్వకాలకు బ్రేక్ పడింది. అధికారుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేస్తున్నట్లు సమాచారం.

'మినగల్లు'లో ఆగని ఇసుక రవాణా

బుచ్చిరెడ్డిపాళెం : మినగల్లు రీచ్‌లో ఇసుక తవ్వకాలకు బ్రేకులు పడటం లేదు. రాత్రింబవళ్లు భారీ యంత్రాలతో తవ్వకాలు జరిపి ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నారు. కోడ్ అమలులో ఉన్నా టిప్పర్లు, లారీలు, ట్రాక్టర్లతో ఇసుక అక్రమ రవాణా చేస్తున్నా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. నెల్లూరు రూరల్ మండలం నరసింహపురంలో (ఎన్ఎస్‌పురం) ఉన్న యార్డు పేరుతోనే రవాణా సాగుతున్నట్టు సమాచారం. కాగా, పెనుబల్లిలో శుక్రవారం జరిగిన ఎన్నికల అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్‌కు ఇసుక అక్రమ రవాణాపై పలువురు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన జేసీ ఇసుక తవ్వకాలకు, రవాణాకు అనుమతులు లేవని ఇటీవలే చెప్పిన మీకు పట్టదా అంటూ తహసీల్దారును హెచ్చరించారు. వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అయినా రీచ్ నిర్వాహకులు మాత్రం ఇసుకను రవాణా చేస్తూనే ఉన్నారు.

ఆటో ఢీకొని వృద్ధుడికి తీవ్ర గాయాలు


ఉదయగిరి వైద్యశాలలో చికిత్స పొందుతున్న మౌలాలీ

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 5: కొత్తపల్లి సమీపంలో గురువారం రాత్రి గ్రామానికి చెందిన కారుమంచి మౌలాలీని ఆటో ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. దేకూరుపల్లి గ్రామంలో జరుగుతున్న ఓ శుభకార్యానికి నడిచి వెళుతున్నాడు. ఈ తరుణంలో మర్రిపాడు మండలం కృష్ణాపురం నుంచి మూగజీవాలు తీసుకొని కుర్రపల్లి వైపు వెళుతున్న టాటా మ్యాజిక్ ట్రాలీ ఆటో అతన్ని ఢీకొని కొంతదూరం ఈడ్చుకెళ్లింది. ఈ ప్రమాదంలో మౌలాలీకి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అతన్ని చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరు తరలించారు. విషయం తెలుసుకున్న ఏఎస్ఐ శ్రీనివాసులు సిబ్బందితో శుక్రవారం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. జీవాలను యజమానులకు అప్పగించామని, డ్రైవర్ పరారీలో ఉన్నాడని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వడదెబ్బతో వృద్ధురాలి మృతి

ఉదయగిరి, ఏప్రిల్ 5: బండగానిపల్లి పంచాయతీలోని కొత్తపల్లి గ్రామంలో శుక్రవారం మూలె చినానాగమ్మ(90) అనే వృద్ధురాలు వడదెబ్బ సోకి మృతి చెందింది. వారం రోజులుగా ఈ ప్రాంతంలో వీస్తున్న వడగాల్పులకు అస్వస్థతకు గురై అవుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ మూలె పద్మజా వినయ్‌రెడ్డి, సర్పంచ్ కల్లూరు వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచులు మూలె సుబ్బారెడ్డి, అక్కులరెడ్డిలు ఆమె భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న ట్రక్‌ఆటో

● ముగ్గురికి తీవ్ర గాయాలు


ఆర్సీపాలెం మలుపు వద్ద ప్రమాదానికి గురైన ఆటో, బస్

కావలి రూరల్, ఏప్రిల్ 5: ఆర్టీసీ బస్సును ఆటో ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన కావలి మండలం రాజువారి చింతలపాలెం గ్రామ మలుపు వద్ద శుక్రవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. కావలి నుండి లింగసముద్రంకు సుమారు 45 మంది ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఆర్సీపాలెం మలుపు వద్ద ఎదురుగా వచ్చిన ట్రక్ ఆటో రుద్దుకుంటూ పోయింది. దీంతో బస్సు కిటికీ అద్దాలు పగలటంతో పాటు కిటికీ వద్ద కూర్చుని ఉన్న ప్రయాణికులు శ్రీజ, అంకమ్మ, మాధవిలకు తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడిన వారిని 108 వాహనంలో కావలి కందుకూరి సూపర్ స్పెషాలిటీ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. విషయం తెలుసుకున్న ఆర్టీసీ డిఎం రాపూరి శ్రీనివాసులు, సిబ్బంది వైద్యశాలకు చేరుకుని క్షత గాత్రులను పరామర్శించారు.


గాయాలతో రోదిస్తున్న మాధవి

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	158
లేయర్ లైవ్	90
స్కిన్ చికెన్	274
స్కిన్‌లెస్	300
లేయర్	153

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6636
వెండి కిలో ధర	రూ. 81,700
వెండి ఒక గ్రాము	రూ. 83.70

దర్గాలో చోరీ

వెంకటాచలం, ఏప్రిల్ 5: కనుపూరు చెరువు సమీపంలోని మస్తాన్ వలీ నిషాన్ దర్గాలో గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. దర్గా లోపల ఉన్న హుండీని పగులకొట్టి అందు లోని నగదును అపహరించుకెళ్లారు. ఐదు నెలలుగా హుండీని తెరవలేదని, అందులో భారీగానే నగదు ఉండవచ్చని దర్గా ముజావర్ చాన్ బాషా వెంకటాచలం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సోమశిలలో 9.241 టీఎంసీల నీరు నిల్వ

అనంతసాగరం: సోమశిల పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా శుక్రవారానికి ప్రాజెక్టులో 9.241 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ ఉత్తర కాలువకు 300, డెల్టాకు 650, దక్షిణ కాలువకు 200 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

క్యాన్సర్ విభాగానికి మంగళం?

- లినాక్ బంకర్ నిర్మాణానికి చరమగీతం
- కేంద్రం ఇచ్చిన రూ.4 కోట్లు ఏమయ్యాయి..?
- అందుబాటులోకి వస్తే అత్యాధునిక సేవలు
- ప్రస్తుతం సాధారణ సేవలకే పరిమితం
- రెడ్‌క్రాస్ కేన్సర్ ఆసుపత్రితో ఒప్పందానికి చర్యలు

నెల్లూరు(వైద్యం), ఏప్రిల్ 5 : నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కేన్సర్ విభాగం ఏర్పాటు విషయంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరి విమర్శలకు దారి తీస్తోంది. ఈ విభాగం ఏర్పాటుకు మూడేళ్ల క్రితం ప్రభుత్వం రూ.40 కోట్లు కేటాయించింది. అయితే ఆ నిధులు విశాఖపట్నంలోని కేన్సర్ విభాగానికి తరలివెళ్లాయి. అప్పట్లో కొందరు వైద్యులు, ప్రజా ప్రతినిధులు ఈ నిధులు వెళ్లకుండా చాలా పోరాటాలు చేశారు. కానీ అవి ఫలితం ఇవ్వలేదు. ఇదిలా ఉంటే ఏడాదిన్నర క్రితం ప్రభుత్వ జనరల్ ఆసు పత్రిలో కేన్సర్ విభాగం ఏర్పాటు చేసేందుకు అత్యాధునిక లినాక్ బంకర్ నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం రూ.4కోట్లు కేటాయించింది. ఆ నిధులు ఏమయ్యాయే ఇప్పటికీ తెలియడం లేదు. ఈ నేపథ్యంలో అత్యాధునిక కేన్సర్ విభాగానికి ప్రభుత్వం మంగళం పాడేసిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో రోగులకు సాధారణ చికిత్సలు మాత్రమే అందుతున్నాయి, ఈ క్రమంలో రోగులకు అత్యాధునిక వైద్య చికిత్సలు అందాలంటే రెడ్‌క్రాస్ కేన్సర్ ఆసుపత్రితోపాటు ప్రైవేట్ ఆసుపత్రులే దిక్కవుతున్నాయి.



లినాక్ బంకర్ ఏర్పాటు చేసి ఉంటే..

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కేన్సర్ వ్యాధికి ఆధునిక వైద్యం అందించేందుకు లినాక్ బంకర్ నిర్మించాలని కేంద్ర ప్రభుత్వం భావించింది. ఇందులో ఏర్పాటు చేసే రేడియో థెరపీ పరికరం ద్వారా శరీరంలోని ఏ భాగానికి కేన్సర్ సోకిందే అక్కడికే కిరణాలు వెళ్లి కేన్సర్ కణాలను చంపేస్తుంది. దీంతోపాటు హైడోస్ రేడియోథెరపీ కూడా ఏర్పాటు చేయటం ద్వారా 42 నుంచి 45 డిగ్రీలలో ట్యూమర్లను తొలగించే వీటుంటుంది. అలాగే సిటీ స్టిమ్యులేటివ్ కొత్త పరికరం ద్వారా కంటి చుట్టుపక్కల ఉంచే కేన్సర్ కణాలను నిర్వీర్యం చేసే విధానం అందు బాటులోకి వస్తుంది. మోమోగ్రామ్ పరికరం కూడా ఈ విభాగంలోకి వస్తుంది. రేడియో ధార్మికత ఎక్కువగా ఉండే ఈ బం కర్ నిర్మాణానికి గతంలో ప్రభుత్వ అనుమ తులు రావటంతో వైద్యాధికారులు సంతోష పడ్డారు. జీజీహెచ్‌లో నిరుపయో గంగా ఉన్న పాత కంటి విభాగం భవనంలో కేన్సర్‌కు ప్రత్యేకంగా బంకర్ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలు కూడా వచ్చాయి. అయితే కేన్సర్ విభాగానికి కేంద్రం ఇచ్చిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం వాడేసుకుందన్న ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో బంకర్ నిర్మాణ పనులు ఎప్పుడు చేపడతారోనన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

రెడ్‌క్రాస్‌తో ఒప్పందం?

ప్రభుత్వం జనరల్ ఆసుపత్రిలో కేన్సర్ విభాగం ఏర్పాటు కలగానే మిగులుతున్న దశలో అధికారులు ప్రత్యామ్నాయ చర్యలకు శ్రీకారం చుడుతు న్నారు. గత నెల మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ నరసింహం నెల్లూరుకు వచ్చిన సందర్భంగా కేన్సర్ ఆసుపత్రి ఏర్పాటుపై కలెక్టర్‌తో, వైద్యాధికారుల తోనూ చర్చించారు. కలెక్టర్ సూచనల మేరకు రెడ్‌క్రాస్ కేన్సర్ ఆసుపత్రిని డీఎంఈ సందర్శించారు. జీజీహెచ్‌కు వచ్చే కేన్సర్ రోగులకు రెడ్‌క్రాస్ ఆసుపత్రిలో చికిత్సలు అందించే అవకాశాన్ని పరిశీలించారు. అవసరమైతే రెడ్‌క్రాస్ కేన్సర్ ఆసుపత్రితో ఒప్పందం చేసుకుని రోగులకు చికిత్సలు అందించేలా కృషి చేయాలని నిర్ణయిం చినట్లు తెలిసింది.

రెడ్‌క్రాస్ ఆసుపత్రిని పరిశీలించాం

జీజీహెచ్‌కు వచ్చే కేన్సర్ రోగులకు అత్యాధునిక వైద్య చికిత్సలు అందించేందుకు కలెక్టర్ ఆదేశాలతో రెడ్‌క్రాస్ కేన్సర్ ఆసుపత్రిని పరిశీలించాం. డీఎంఈ డాక్టర్ నరసింహం పూర్తి స్థాయిలో పరిశీలన జరిపారు. రెడ్‌క్రాస్ రాష్ట్ర కమిటీతో చర్చించి ఒప్పందానికి వచ్చే అవకాశం ఉంది. గతంలో ఆసుపత్రిలో కేన్సర్ చికిత్సకు అత్యాధునిక లినాన్ బంకర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు వచ్చాయి. అయితే ఎందువల్లనో అవి వెనక్కు వెళ్లాయి. ప్రస్తుతం కేన్సర్ విభాగంలో రొమ్ము కేన్సర్, పెద్దప్రేగు కేన్సర్, గర్భాశయ ముఖద్వార కేన్సర్, హెడ్ అండ్ నెక్ కేన్సర్ వంటి వాటికి వైద్య చికిత్సలు అందించటం జరుగుతోంది.

- డాక్టర్ సిద్దానాయక్, జీజీహెచ్ సూపరింటెండెంట్



అధ్యయన కేంద్రం సంచాలకుడు సంపత్‌కుమార్‌ను సన్మానిస్తున్న కవులు, కళాకారులు, ఓత్సాహిక సాహితీవేత్తలు



ఉత్సాహంగా ఉగాది కవి సమ్మేళనం

వెంకటాచలం, ఏప్రిల్ 5 : మండలంలోని సరస్వతీనగర్ వద్ద ఉన్న ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో ఉగాది క్రోధి నామ సంవత్సరం సందర్భంగా శుక్రవారం వైభవంగా కవి సమ్మేళనం జరిగింది. ఈ సమ్మేళనంలో కవులు, కళాకారులు, ఓత్సాహిక సాహితీవేత్తలు విశేషంగా పాల్గొని విజయవంతం చేశారు. ప్రపంచమొక పద్మవ్యూహం.. కవిత్వం ఒక తీరన దాహం అన్నట్లుగా కవులు ఎన్నో ఎన్నెన్నో భావాల్ని తమ కవితలు, పాటలు, పద్యాల ద్వారా వినిపించడం చాలా గొప్పదని అధ్యయన కేంద్రం సంచాలకులు మాడభూషి సంపత్‌కుమార్ పేర్కొన్నారు. ఇటీవల వెలువడిన ప్రభాత, ప్రచురత గ్రంథాలను సుప్రసిద్ధ సాహితీవేత్త గంగిశెట్టి శివకుమార్, చిన్ని నారాయణరావు ఆవిష్కరించారు. ప్రసిద్ధ రచయిత ఈతకోట సుబ్బారావు 'పోడు గాలి' కథాసంపుటిని ప్రముఖ వక్త లతీఫ్ కుట్టి ఆవిష్కరించారు. కాగా రచయిత, విమర్శకుడు అబ్దుల్ రాజా హుస్సేన్ రాసిన స్ఫూర్తిప్రదాతలు పైగంబర కవిత్వం పుస్తకాలను గోవిందరాజు సుభద్రాదేవి, నాగసాయి సూరి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఓత్సాహిక సాహితీ బంధువులు, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం విద్యాత్మక సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల ఏకాంతసేవ

● కొనసాగుతున్న త్యాగరాజ స్మరణోత్సవాలు


సీతారాముల ఏకాంతసేవ

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 5 : నెల్లూరు పురమందిరంలో జరుగుతున్న త్యాగరాజ స్మరణోత్సవాల్లో శుక్రవారం ఉదయం కనుల పండువగా సీతారాముల కల్యాణం జరిగింది. ఈ సందర్భంగా వాణీ భాగవతారిణి సీతారాముల కళ్యాణం హరికథను గానం చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది. మధ్యాహ్నం కర్నూలుకు చెందిన జే సాయిరామ్ భాగవతార్ వాగ్గేయకారుడు అన్నమయ్య చరిత్ర హరికథ గానం చేశారు. సాయంత్రం స్థానిక కళాకారులు త్యాగరాజ కృతులు ఆలపించారు. రాత్రి విద్యా కల్యాణ రామన్ అండ్ పార్టీ గాత్ర కచేరీ శ్రోతలకు వీనుల విందు చేసింది. అనంతరం సీతారామచంద్రులకు ఏకాంత సేవ నేత్రపర్వంగా జరిగింది. ఈ కార్యక్రమాలను భిక్షాటన పూర్వక శ్రీత్యాగరాజ స్మరణోత్సవ సభ శాశ్వత కార్యదర్శి డాక్టర్ వై నాగదేవీప్రసాద్, అన్నవరం సత్యనారాయణ, ఆర్‌వీ మల్లికార్జున్ రావు, కనుపర్తి పద్మావతి తదితరులు పర్యవేక్షించారు.

ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకోండి

● ప్రజలకు కలెక్టర్ పిలుపు


చేజర్ల : బోడిపాడు గ్రామస్థులతో మాట్లాడుతున్న కలెక్టర్


చేజర్ల/బుచ్చిరెడ్డిపాళెం ఏప్రిల్ 5: రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా వినియోగించుకోవాలని కలెక్టర్ హరినారాయణన్ ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన బుచ్చిరెడ్డిపాళెం మండలం పెనుబల్లి గిరిజనకాలనీ, చేజర్ల మండలం బోడిపాడు గ్రామంలో పర్యటించారు. బోడిపాడులోని పోలింగ్ కేంద్రాన్ని ఆర్డీఓ మాధవీలత కలిసి పరిశీలించి మాట్లాడారు. అనంతరం చేజర్ల ఎస్టీ కాలనీలో స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఓటర్లకు అవగాహన కల్పించారు. ఇప్పటివరకు ఓటు నమోదు చేసుకోనివారు కూడా ప్రస్తుతం చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు కే.గోపికృష్ణ, ఎమ్పీడీవో కరీముల్లా, ఎస్ఐ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. పెనుబల్లి గిరిజనకాలనీలో సెల్ఫీ బూత్‌ను కలెక్టర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు, ఎంపీడీఓ, ఆర్ఐ, సిబ్బంది, స్వీప్‌నోడల్ అధికారి పీవీ రత్నం, బీఎల్ఓలు పాల్గొన్నారు.

జల రవాణాకు ప్రాధాన్యత


జ్ఞాపికలను ఆవిష్కరిస్తున్న సీఈఓ రాజన్‌బాబు

ముత్తుకూరు, ఏప్రిల్ 5: దేశంలో జల రవాణా అత్యంత ప్రాముఖ్యత సంతరించుకుందని అదాని కృష్ణపట్నం పోర్టు సీఈఓ రాజన్ బాబు తెలిపారు. శుక్రవారం 61 వ జాతీయ సముద్రయాన దినోత్సవం సందర్భంగా అదాని కృష్ణపట్నం పోర్టులో మెరైన్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. జల మార్గంలో రవాణా చేస్తే తక్కువ ఖర్చుతో ఎక్కువ రవాణా జరుగుతుందన్నారు. ముఖ్యంగా పర్యావరణానికి హాని కలుగకుండా సరుకు రవాణా జరుగుతుందని తెలిపారు. దేశ షిప్పింగ్ పరిశ్రమను పునరుద్ధరించడంలో సహాయపడిన భారతీయ పారిశ్రామికవేత్తలను గౌరవించడానికి 1964లో జాతీయ సముద్రయాన దినోత్సవం ప్రారంభించారన్నారు. మారిటైమ్ ఇండియా విజన్ 2030లో భాగంగా ఒక్కొక్కటి 300 మిలియన్ టన్నులకు పైగా కార్గో సామర్థ్యం కలిగి ఉన్న మూడు మెగా మేజర్ ఓడరేవులను నిర్మించారని, దేశంలో రవాణా చేసే భారతీయ కార్గో స్థాయిని 25శాతం నుంచి 75శాతానికి పెంచడం లక్ష్యమన్నారు. అదాని కృష్ణపట్నం పోర్టును ఈ దిశగా అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కెప్టెన్ రంజిత్ గార్గ్, కెప్టెన్ సాహూ, జునీద్, గణేష్‌శర్మ, రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

కమ్ముకున్న పొగ మంచు



ఈ ప్రాంతంలో శుక్రవారం దట్టంగా పొగమంచు కమ్ముకుంది. అర్ధరాత్రి నుంచి తెల్ల వారు జామున తొమ్మిది గంటల వరకు పొగమంచు వీడలేదు. వాహనదారులు లైట్ల వెలుగులో ప్రయాణించాల్సి వచ్చింది. పగలు వడగాల్పులు, రాత్రివేళ మంచు కురుస్తుండడంతో వాతావరణంలో ఏర్పడిన మార్పులతో ప్రజలు అనారోగ్యం బారిన పడే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు.

- ఉదయగిరి

ఎన్నికలప్పుడే గుర్తొచ్చే రోడ్డు!


కంకర తేలిన రాళ్లతో ప్రమాదకరంగా ఘాట్‌రోడ్డు

- 2007లో ఉదయగిరి-బండగానిపల్లి రోడ్డు నిర్మాణానికి చర్యలు
- ప్రారంభంలోనే నిలిచిన పనులు
- 3.2 కి.మీ దూరానికి అందని అటవీ శాఖ అనుమతి
- నాయకులకు ఎన్నికల అస్త్రంగానే మిగిలిన రోడ్డు

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 5 : దశాబ్దాలు గడుస్తున్నా గ్రామాల రహదారుల నిర్మాణ పనులకు మాత్రం మోక్షం లభించడం లేదు. ఈ సమస్యతో వాహనదారులు ప్రయాణాలను నరకప్రాయంగా భావిస్తున్నారు. అందుకు నిదర్శనమే ఉదయగిరి-బండగాని పల్లి ఘాట్‌రోడ్డు నిర్మాణం. 2007లో అప్పటి ప్రభుత్వం నిర్మాణానికి చర్యలు చేపట్టింది. తమ బాధలు తీరాయనుకున్న కొండ కింద గ్రామాల ప్రజలకు నిరాశే మిగిలింది. రహదారి నిర్మాణంలో 3.2 కిలోమీటర్ల అటవీ అనుమతులు లేకపో వడంతో పనులు ప్రారంభంలోనే నిలిచిపోయాయి. అప్పటి నుంచి ఇప్పటివరకు రోడ్డు అధ్వానంగా తయారై కంకర రాళ్లు తేలాయి. ఈ రహ దారిపై ప్రయాణం చేయాలంటే ఆ పల్లెవాసులు బాధలు వర్ణనాతీతం. నాటి నుంచి దీని నిర్మాణం ఎన్నికల అస్త్రంగానే మిగిలిపోయింది. ఎన్నికల వచ్చిన ప్రతిసారీ పోటీ నిలిచే అభ్యర్థులు తనకు మద్దతు ఇస్తే రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తామని చెబుతున్న హామీని నీటిమూటగానే మిగిలిపోయింది.

పరిశీలనతో సరి

గ్రామాల ప్రజల వత్తిడితో నేతలు ఎలాగైనా రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని పూనుకొన్నారు. ఈ తరుణంలో అధికారుల చుట్టూ ప్రదక్షణలు చేపట్టి రోడ్డు నిర్మాణంలో అటవీశాఖ కోల్పోతున్న భూమికి ప్రత్యామ్నాయంగా నేలటూరు సమీపంలో భూమిని సైతం కేటాయించారు. ఆ భూమిని రెవెన్యూ, అటవీ శాఖ ఉన్నతాధికారులు కూడా పరిశీలించారు. అయితే అందుకు సంబంధించిన ఫైలు కలెక్టర్ కార్యాలయం నుంచి దాటి వెళ్లలేదని పలువురు ఆరోపిస్తున్నారు. దీంతో రోడ్డు నిర్మాణానికి నోచుకోలేదు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే 12 గ్రామాల్లోని 15 వేల మంది ప్రజలకు ఉదయగిరికి రాకపోకలు సాగించేందుకు అనువుగా ఉంటుంది. రహదారి నిర్మాణం పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు పలుమార్లు ఆందోళనలు చేపట్టినా అధికారులు, పాలకుల్లో చలనం లేకుండా పోయింది. ప్రతిరోజు కంకర తేలిన రహదారిపై రాకపోకలు సాగిస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఘాట్‌రోడ్డు రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

9న భువనేశ్వరికి శాకంబరి అలంకారం

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 5 : శ్రీక్రోధినామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా మంగళవారం 9వ తేదీ మూలస్థానేశ్వరాలయంలో భువనేశ్వరి అమ్మవారికి శాకంబరి అలంకారం జరుగుతుందని ఈవో ఆరంబాకం వేణుగోపాల్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 7గంటలకు స్వామివారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, 7.30గంటలకు వివిధ రకాల పండ్లు, కూరగాయలతో శాకంబరి అలంకారం, సాయంత్రం 6గంటలకు పంచాంగ శ్రవణం, శివపార్వతుల కల్యాణం, పుష్పయాగం, పేట ఉత్సవం జరుగుతాయని, భక్తులు అందరూ తరలిరావాలని కోరారు.

రేపు ఉగాది పురస్కారాలు

హరివిల్లు క్రియేషన్స్, 25 కళాసంఘాల పర్యవేక్షణలో ఆదివారం ఉగాది పురస్కారాల ప్రదానోత్సవం జరుగుతుందని హరివిల్లు క్రియేషన్స్ నిర్వాహ కుడు దోర్నాల హరిబాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వేడుక పురమందిరంలో సాయం త్రం 6 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు. సినీనటుడు కిషోర్‌దాస్ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు.

టీడీపీ వస్తే మహిళలకు వడ్డీలేని రుణాలు

- ఉదయగిరి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్
- నాయకులు, కార్యకర్తల ఘన స్వాగతం


పింఛన్ పెంపు గురించి అవ్వ, తాతలకు వివరిస్తున్న కాకర్ల సురేష్

సీతారామపురం, ఏప్రిల్ 5: టీడీపీ అధికారంలోకి వస్తే మహిళల నైపుణ్యాలు, ఆర్థిక అవకాశాలను పెంపొందించేందుకు 'కలలకు రెక్కలు' పథకం కింద వడ్డీ లేని రుణాలను అందజేస్తామని ఉదయగిరి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ తెలిపారు. శుక్రవారం గుండుపల్లి, ఓగురువారిపల్లి, చింతోడు, బోడసిద్దయిపల్లి, సీతారామపురం పంచాయతీల్లో ఇంటింటి ప్రచారానికి వెళ్తున్న ఆయనకు మహిళలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కాకర్ల ప్రతిఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ వారి వద్ద కూర్చొని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల అనంతరం తమ సమస్యలను తీరుస్తానని హామీ ఇచ్చారు. ప్రతిఇంటికి వెళ్లి తెలుగుదేశంకు ఓటు వేయాలని పార్టీ మేనిఫెస్టోని వివరించారు. 40ఏళ్ల రాజకీయ అనుభవం అని చెప్పుకుని తిరిగే మేకపాటి రాజగోపాల్ రెడ్డి ఏ ఒక్కరికైనా ఆర్థికసాయం చేశాడా, ఏ గ్రామానికైనా మంచి పనులు చేశాడా అని ప్రశ్నించారు. తాను రాజకియాల్లోకి వచ్చి రెండు సంవత్సరాలు అయినా నియోజకవర్గంలో ప్రత్యక్షంగా 20వేల కుటుంబాలకు, పరోక్షంగా పది వేలకు టుంబాలకు ఆర్థికసాయం చేశానన్నారు. వైద్యం, జీవనోపాధి, అన్నదాన కార్యక్రమాలు, మంచి నీటి చలివేంద్రాల ఏర్పాటు చేసినట్లు గుర్తుచేశారు. సంపాదించిన సొమ్మును పది మందికి పంచి దానం చేసే తాను గొప్పవాడో, ఉన్నది దోచుకుని తినే వైసీపీ నాయకులు మంచివారో ఓటర్లు ఆలోచించాలన్నారు. సొంత మండలం నందవరం తారు రోడ్డు వేయలేని మేకపాటి సోదరులు పక్క నియోజకవర్గం ఉదయగిరికి ఏమి అభివృద్ధి చేస్తారని ప్రశ్నించారు. రోజుకో సమస్య సృష్టించి ఎన్నికల్లో గెలవాలని వైసీపీ నాయకులు చూస్తున్నారని వారి మాటలు నమ్మొద్దన్నారు. వైయస్ జగన్ వలంటీర్లకు రాజకీయరంగు అంటించకుండా చట్టభద్రత కల్పించి రాజకీయాలకతీతంగా జీతభత్యాలు ఇచ్చి ఉంటే ఈ రోజు రాష్ట్రంలో వలంటీర్లకు ఇలాంటి సమస్య వచ్చేది కాదన్నారు. తాము వాలంటీర్లకు వ్యతిరేకం కాదని అధికారంలోకి వచ్చిన వెంటనే వలంటీర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామన్నారు. మండల ప్రజలు ఒక్కసారి తనకు, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి మద్దతు పలికి తెలుగుదేశం భారీ మెజారితో గెలుపొందేలా చూడాలన్నారు. ప్రతి ఒక్కరికీ అన్ని వేళలా అందుబాటులో ఉంటానని చెప్పారు.


ప్రచారథంపై మాట్లాడుతున్న కాకర్ల

ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు, సూపర్ సిక్సర్ క్యాలెండర్లను పంపిణీ చేశారు. మండల క్లస్టర్ ఇన్‌చార్జి వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, చింతల శ్రీనువాసులు, మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్ రాజు, చేన్నకేశవులు, బోగినేని కాశి రావు, సీతారామపురం సర్పంచ్ భాగ్య కుమారి, పాలిశెట్టి శ్రీనివాసులు, మాజీ జెడ్పీటీసీ కలివెల జ్యోతి, జాషువా, సర్పంచ్‌లు వెంకటసుబ్బయ్య, ఆదినారాయణ, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

రాక్షస పాలన పోయి.. రామరాజ్యం రావాలి

- ఆత్మకూరు టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి


చేజర్లలో బహిరంగ సమావేశంలో నాయకులు, కార్యకర్తలతో ఆనం మనారాయణరెడ్డి

చేజర్ల: రామరాజ్యం రావాలంటే రాక్షసపాలన పోవాలని ఆత్మకూరు నియోజకవర్గ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలకేంద్రంలో టీడీపీ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మాజీ శాసనసభ్యులు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, కొమ్మి లక్ష్మయ్యనాయుడుతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సమావేంలో మాట్లాడారు. చెంతనే సోమశిల డ్యాం ఉన్నా ఈ సంవత్సరం సోమశిల దక్షిణ కాలువకు నీటిని విడుదల అడ్డుకునేందు దుకు ప్రస్తుత శాసనసభ్యులు తీవ్రంగా అడ్డుకున్నాడో అధికారులకే తెలుసన్నారు. రాబోయే రోజుల్లో ఆత్మకూరు నియోజరవర్గంలో ఒక్క ఎకరాలకు నీరందలేదు అనే మాట రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అదే విధంగా మండలంలో పది కోట్ల రూపాయలు పైగా అభివృద్ధి చేయగా వైసీపీ పాలకులు ఆ జాడే కన్పించలేదన్నారు. కార్యక్రమంలో కిమ్స్ హాస్పిటల్ ఈడీ గిరినాయుడు, బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

భారీగా టీడీపీలోకి చేరికలు

బూధళ్ళ రాఘవరెడ్డి - సొసైటీ అధ్యక్షులు, గోపిదేశి అరుణ, సర్పంచ్, తిమ్మాయపాళెం, గొర్ల శివకుమారి- సర్పంచ్ బిల్లుపాడు, పర్చూరు విజయమ్మ- సర్పంచ్ చిత్తలూరు, గుమ్మా వెంకటేశ్వర్లు- సర్పంచ్ పాడేరు, గుమ్మా ప్రభావతి- ఎంపీటీసీ పాడేరు, గార్లపాటి రాజమ్మ- ఎంపీటీసీ వావిలేరు, నాగిపోగు తిరపతమ్మ- ఎంపీటీసీ టికేపాడు, షేక్ మస్తాన్ - ఎంపీటీసీ పుట్టుపల్లి, షేక్ సిరాజుద్దీన్ ముస్లిం మైనార్టీ నాయకులు ఆనం సమక్షంలో టీడీపీలో చేరారు.

అనుచరులతో టీడీపీలో చేరిన వైసీపీ సర్పంచు

అనంతసాగరం: గౌరవరంకు చెందిన వైసీపీ సర్పంచు శాఖమూరి సుబ్బారావు టీ డీపీలో చేరారు. నెల్లూరు పార్లమెంటు అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆత్మకూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఆత్మకూరులో తన అనుచరులు 200మందితో పార్టీలో చేరారు.

బాబూ జగ్జీవన్‌రామ్ సేవలు స్ఫూర్తిదాయకం

- ఘనంగా ఆయన జయంతి వేడుకలు
- పూలమాలలు వేసి నివాళులర్పించిన నేతలు, నాయకులు
- ఆయన సేవలను గుర్తు చేసుకుంటూ నేతల ప్రసంగం


ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలలో నివాళులర్పిస్తున్న వైద్యులు, సిబ్బంది


సీతారామపురం: నివాళులర్పిస్తున్న కాకర్ల సురేష్

సీతారామపురం, ఏప్రిల్ 5: బాబూ జగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం సీతారామపురం బస్టాండ్‌సెంటర్‌లో ఆయన చిత్రపటానికి కాకర్ల సురేష్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతిఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు అందాలని వెనుకబడినవర్గాలు ఆనందంగా జీవించాలని కృషి చేసిన మహనీయుడు జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు. ఆయన్ను స్ఫూర్తిగా తీసుకొని సమ సమాజ స్థాపనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల క్లస్టర్ ఇంచార్జి వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, చింతల శ్రీనువాసులు, మండల కన్వీనర్ కప్పా ప్రభకర్ రాజు, సీతారామపురం ఎంపీటీసీ తమ్మిశెట్టి వెంకటసుబ్బమ్మ, చేన్నకేశవులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: ఆత్మకూరులోని ప్రభుత్వ జిల్లా వైద్యశాలలో సూపరింటెండెంట్ డాక్టర్ శేషారత్నం ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బంది భారత మాజీ ఉపప్రధాని జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా కార్యక్రమంలో ఆర్ఎం డాక్టర్ ఉషాసుందరి పాల్గొన్నారు. ఉప రవాణా శాఖ కార్యాలయంలో ఎంవీఐ రాములు, సిబ్బంది ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక రవితేజ కల్యాణ మండపంలో మాదిగల పోరాట సమితి నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏపీఎంఆర్పీఎస్ నాయకులు ఏసుపోగు బాబు, అద్దంకి రామకృష్ణ, బి.శ్రీనివాసులు, డాక్టర్ అవినాష్ బాబుజగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఉదయగిరి: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఎంపీపీ మూలె పద్మజా వినయ్‌రెడ్డి, ఎంపీటీసీ గొల్లపల్లి తిరుపతి, మండల వైసీపీ కన్వీనర్ ఓబులరెడ్డిలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అలాగే ఎస్సీ కాలనీలో ఎమ్మార్పీఎస్ నాయకులు బకీరు జాషువా ఆధ్వర్యంలో జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కల్లూరు వెంకటేశ్వరరెడ్డి, మాజీ మండల వైసీపీ కన్వీనర్ అక్కి భాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచులు అక్కులరెడ్డి, సుబ్బారెడ్డి, నాయకులు అశోక్, యస్థానీ, ఉప్పుటూరి శ్రీను, ఎంఏ సలీం తదితరులు పాల్గొన్నారు.

దుత్తలూరు(ఉదయగిరి రూరల్): స్వాతంత్ర్య సమరయోధులు, భారత మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్ జయంతిని దుత్తలూరులో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంఎస్పీ జాతీయ నాయకులు గొల్లపల్లి శ్రీనివాస్‌మాదిగ, మాజీ జడ్పీటీసీ చీదర్ల మల్లికార్జున, నాయకులు గొల్లపల్లి మోహన్‌రావు, బర్రె అర్జున్, కొసినపోగు రవి, గొల్లపల్లి లక్ష్మయ్య, సుందరరాజ్, రమణయ్య, అనిల్ పాల్గొన్నారు.

మర్రిపాడు: మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులు జగ్జీవన్ రామ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఉప ప్రధానిగా ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో బొద్దుకూరు మహేష్ మాదిగ, లక్ష్మయ్య మాదిగ, కన్నెమరకల తిరుపతయ్య మాదిగ, అంకయ్య మాదిగ పాల్గన్నారు.


ఉదయగిరిలో నివాళుర్పిస్తున్న ఎంపీపీ మూలె పద్మజా వినయ్‌రెడ్డి


మర్రిపాడు: నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ముస్లిం పెద్దలకు రంజాన్ కానుక అందజేత

ఆత్మకూరు, ఏప్రిల్ 5: రంజాన్ పవిత్రమాసం సందర్భంగా శుక్రవారం స్థానిక పెద్ద మసీదులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మున్సిపాలిటీ పరిధిలోని 12 మసీదులకు సంబంధించిన 40 మంది మౌజన్, పేష ఇమామ్, హఫీజ్ సాబ్‌ల (మత ప్రబోధకులు)కు గౌరవ పారితోషకం కింద బీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బొమ్మిరెడ్డి తారక్‌నాథ్‌రెడ్డి నగదును అందజేశారు. ముస్లిం సోదరులకు తోడ్పాటు అందిస్తానని తెలిపారు. ముస్లిం సోదరులందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తార్‌నాథ్‌రెడ్డిని పలువురు మసీదు పెద్దలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జమియా మసీదు ముతవల్లి షేక్ అహ్మద్, సెక్రటరీ ఎండీ సాధిక్ హుసేన్, ముజ్జు, సయ్యద్ మున్నా పాల్గొన్నారు.

మసీదుల ముస్తాబు

ఉదయగిరి, ఏప్రిల్ 5: మండలంలోని గ్రామాల మసీదులు రంజాన్ పండుగను పురస్కరించుకుని శుక్రవారం ముస్తాబయ్యాయి. ముస్లిం సోదరులు అత్యంత భక్తిశ్రద్ధలతో శనివారం షబ్-ఏ-ఖదర్ పండుగను జరుకోనున్నారు. అందులో భాగంగా మండలంలోని గండిపాళెం, వెంగళరావునగర్, దాసరిపల్లి, బిజ్జంపల్లి, పుల్లాయపల్లి, అయ్యవారిపల్లి, ఉదయగిరిలోని మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ఆపస్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం


సంగం: చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న ఆపస్ ఉపాధ్యాయులు

సంగం, ఏప్రిల్ 5: స్థానిక అంజనేయస్వామి ఆలయం సమీపంలో ఆపస్ ఉపాధ్యాయ సంఘం నాయకులు శుక్రవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ప్రతిఏటా వేసవిలో ప్రయాణికుల కోసం ఈ కార్యక్రమం చేపడతామన్నారు. తొలిరోజు మజ్జిగ పంపిణీ చేశారు. రేపటినుంచి రెండు నెలలపాటు చలివేంద్రం కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సురేంద్రరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, నారాయణ, అన్నె సురేంద్ర పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యం

వింజమూరు, ఏప్రిల్ 5: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే దేశంలోనూ ఇటు రాష్ట్రంలోనూ అభివృద్ధి సాధ్యమని ఉదయగిరి నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి సోము అనిల్‌కుమార్ రెడ్డి తెలిపారు. బుక్కాపురం పంచాయతీలో శుక్రవారం 100 మంది ఆయన సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పది సంవత్సరాలుగా రాష్ట్రంలో కాంగ్రెస్ లేని లోటు అందరూ చూశారన్నారు. గత ప్రభుత్వాలు ముందుచూపు లేకుండా ప్రజలకు ఉపయోగపడే ఏ మంచిపని చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతు రుణమాఫీ, గిట్టుబాటు ధర తీసుకొస్తామన్నారు. ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు అందరికీ ఉచిత విద్యుత్ కూడా అందిస్తామని తెలిపారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఒక కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు మద్దూరు రాజగోపాల్‌రెడ్డి, జగదీష్ ఉన్నారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

రెండు నెలల్లో చంద్రోదయం

- 11వ వార్డులో వేమిరెడ్డి, కావ్యకు ప్రజల నీరాజనాలు


కావలి: ఓటు అభ్యర్థిస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావ్య క్రిష్టారెడ్డి

కావలి, ఏప్రిల్ 5: మరో రెండు నెలల్లో చంద్రోదయం రానుందనే ఆనందంతో ఎన్నికల ప్రచారంలో ఓట్లు అడగక ముందే ప్రజలు సైకిల్ గుర్తుకే తమ ఓట్లు అని చెబుతూ ముందుకు వస్తున్నారని నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. కావలి పట్టణ 11వ వార్డులోని అంబేద్కర్ నగర్‌లో శుక్రవారం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలిసి ఆ వార్డు ఇన్‌చార్జి జ్యోతిబాబూరావు ఆధ్వర్యంలో ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి కావ్య క్రిష్టారెడ్డిలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వార్డులో ప్రతి ఇంటికీ వెళ్లి వారి సమస్యలు తెలుసుకుంటూ టీడీపీ అధికారంలోకి వస్తే అందించే పథకాలు గురించి వివరించారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రూ. 4వేల పింఛన్ ప్రతినెలా మీ ఇంటికి వచ్చి అందించటం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి కావ్య క్రిష్టారెడ్డి మాట్లాడుతూ ఉంటున్న ఇళ్లకు నివేశన స్థలాల పట్టాలు లేవని అడుగుతున్నారని, టీడీపీ అధికారంలోకి రాగానే పట్టాలు ఇప్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మాజీ ఇన్‌చార్జి మాలేపాటి సుబ్బానాయుడు, జనసేన ఇన్‌చార్జి అళహరి సుధాకర్, సిద్దూ, టీడీపీ నేతలు, తదితరులు పాల్గొన్నారు.

- **టీడీపీలోకి భారీ చేరికలు**

కావలి రూరల్ మండలం లక్ష్మీపురం, వెంకటేశ్వరపురం, ఆదినారాయణపురానికి చెందిన టీడీపీ రూరల్ మండల అధ్యక్షుడు ఆవుల రామకృష్ణ ఆధ్వర్యంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ముసునూరు టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆవ్య క్రిష్టారెడ్డి వారికి పార్టీ కండువాలను వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే కావలి పట్టణ వైసీపీ అధికారప్రతినిధి గంగు చంద్రశేఖర్ ఏటూరి శివ, మెట్టుకూరు అమరజీవిరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరగా కండువా కప్పి కావ్య ఆహ్వానించారు.

టీడీపీ పాలనలోనే బడుగు వర్గాల అభివృద్ధి : మాలేపాటి

బిట్రగుంట (దగదర్తి) : తెలుగుదేశం ప్రభుత్వ పాలనలోనే బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి జరుగుతుందని కావలి నియోజకవర్గ నాయకుడు మాలేపాటి సుబ్బానాయుడు అన్నారు. శుక్రవారం దగదర్తి మండలం చెన్నూరు పంచాయతీలో టీడీపీ నేతలు, కార్యకర్తలతో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మండల కన్వీనర్ అల్లం హనుమంత రావు, నేతలు జలదంకి శ్రీహరినాయుడు, మల్లికార్జునరెడ్డి, రమణయ్య, శ్రీనివాసులు, రమణమ్మ, ప్రసాద్‌నాయుడు, శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం

బిట్రగుంట: బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ ఇబ్రహీంపేటలోని కల్యాణ మండలంలోని వైసీపీ, ఇతర పార్టీల నుంచి శుక్రవారం పలువురు టీడీపీలో చేరారు. మండల పార్టీ కన్వీనర్ మాలేపాటి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి పార్టీల కావలి అసెంబ్లీ అభ్యర్థి (కావ్య) దగ్గుమాటి క్రిష్టారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నాగులవరం మాజీ ఎంపీటీసీ వైసీపీ నేత పిన్నిబోయిన సుధాకర్ అతని అనుచరులు దాదాపు 150 మందికిపైగా టీడీపీలో చేరారు. విశ్వనాథరావుపేట పంచాయతీకి చెందిన శ్రీధర్, రాజశేఖర్‌తో పాటు పలువురు పార్టీ కండువా కప్పుకున్నారు. విశ్వనాథరావుపేట కొత్తూరు వార్డు సభ్యులు బాలాజీ మరి కొందరు బీద, కావ్యల చేతుల మీదుగా పార్టీ కండువ కప్పుకున్నారు. కప్పరాళ్ళ తిప్పకు చెందిన పలువురు యువత, మహిళలు టీడీపీలో చేరారు. రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు చెంచయ్య తదితరులు చేరారు. ఈ సందర్భంగా రవిచంద్ర మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ళ పాలనలో అభివృద్ధి శూన్యం అన్నారు. కావ్య క్రిష్టారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబునాయుడుకే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నేత పమ్మిడి రవికుమార్‌చౌదరి, దగ్గుమాటి వేణుగోపాల్‌రెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, మాధవరావు, సుధీర్‌బాబు, రఘురామ్ నాయుడు, రమేష్‌రెడ్డి, విజయకుమార్, ఆదిశేషయ్య, కోటారెడ్డి తదితరులు ఉన్నారు.


బిట్రగుంట : మాట్లాడుతున్న బీద రవిచంద్ర

ప్రశ్నిస్తే ఇబ్బందులకు గురిచేసే ప్రభుత్వం అవసరమా

అల్లూరు: ప్రశ్నిస్తే ఇబ్బందులకు గురిచేసే ప్రభుత్వం ప్రజలకు అవసరమా అని నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన అల్లూరు పట్టణ పరిధిలోని దళితవాడలో శుక్రవారం సాయంత్రం వాకాటి బినీత్‌రెడ్డి, చందన్‌రెడ్డిలతో కలసి ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో బండి శ్రీనివాసులు రెడ్డి, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, అరగల రమణయ్య, అనూరాధ, కరీమా పాల్గొన్నారు.

ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు


బాబు జగజ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వేమిరెడ్డి, కావ్య

కావలి టౌన్, ఏప్రిల్ 5: మాజీ ఉప ప్రధాని దివంగత బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ట్రంకురోడ్డులోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నేతలు కిరణ్, మందా వెంకటేశ్వర్లు, కొండయ్య, నర సయ్య, జయంత్, రాఘవులు తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి నివాసం వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి, కావ్య కృష్ణారెడ్డిలు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే నివాసంలో జగజ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఎమ్మెల్యే తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

- **కందుకూరు:** దివంగత భారత ఉపప్రధాని డాక్టరు బాబు జగ్జీవన్‌రామ్ జయంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కందుకూరు సబ్ కలెక్టరు జి విద్యాధరి ఆధ్వర్యంలో స్థానిక సబ్ కలెక్టరు కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం, మండల రెవిన్యూ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయాల్లో జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమం నిర్వహించి నివాళులర్పించారు. కందుకూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టీడీపీ, జనసేన, బీజేపీల అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పార్టీ నాయకులు, ఎస్సీసెల్ ప్రతినిధులతో కలిసి పట్టణంలోని చర్చి సెంటర్‌లో ఉన్న జగ్జీవన్‌రామ్ కాంస్య విగ్రహం వద్దకు చేరుకుని పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బీజేపీ నాయకులు గట్టమనేని హరిబాబు, జొన్నాదుల రాఘవయ్య, జగన్నాథం వైకుంఠం, మన్నేపల్లి వరప్రసాదరావు తదితరులు చర్చి సెంటర్‌లోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైసీపీ కార్యాలయంలో బుర్రా మధుసూదన్ యాదవ్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించి నివాళులర్పించారు. ఎంఆర్‌పీఎస్, మహాజన సోషలిస్టు పార్టీల ప్రతినిధులు జగదంకి నరసింగరావు, వర్ల దేవదాస్ మాదిగ, ముత్తు, కిట్టు తదితరులు పట్టణంలోని చర్చి సెంటర్‌లో ఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఆయన జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించి నివాళులర్పించారు.

కలిగిరి: జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం కలిగిరి పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు నందిపోగు వెంగళరావు, ఎంఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు ఐమూరి మోజెస్, ఎమ్మార్పీఎస్ నాయకులు తుమ్మూరి చిన్నా, పేమల మాల్యాద్రి, ఎలికా మాలకొండయ్య పాల్గొన్నారు.

అల్లూరు: టీడీపీ ఎంపీ అభ్యర్థి కార్యాలయంలో శుక్రవారం జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్, కావ్య కృష్ణారెడ్డి అల్లుడు బినీత్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మేనల్లుడు చందన్‌రెడ్డిలు ఈ కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించారు.

ఉలవపాడు: మండల పార్టీ కార్యాలయంలో టీడీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు రావినూతల రమేష్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ నాయకులు పొడపాటి సుధాకర్, ఎస్సీ సామాజిక నాయకులు జీ మోషే, రావిపాటి శ్రీనులతోపాటు మండలంలోని అన్ని గ్రామాల నుంచి టీడీపీ నాయకులు ఉన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ లక్ష్మీ సుధారాణి జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

లింగసముద్రం : స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మండల తెలుగు యువత అధ్యక్షుడు అడపా రంగయ్య, గ్రామ పార్టీ అధ్యక్షుడు గాలంకి ప్రసాద్‌ల ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బింకం శేషయ్య, సీహెచ్ బాలకోటయ్య, జంపాల శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అవకాశం ఇవ్వండి అభివృద్ధి చేస్తా : కాకర్ల

కలిగిరి: ఉదయగిరి నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు ఒక్కసారి అవకాశమిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని కాకర్ల సురేష్ పేర్కొన్నారు. తొలిసారిగా మండలంలోని రావులకొల్లు గ్రామంలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాకర్ల మాట్లాడుతూ ప్రతి గ్రామం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడమే తన లక్ష్యమన్నారు. పార్ల మెంటు అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని, తనని అఖండ మెజార్టీతో గెలిపిస్తే రాష్ట్రంలోనే నియోజకవర్గాన్ని రోల్ మోడల్ చేస్తామని పేర్కొన్నారు.

పలు కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరిక


ఇంటూరి సమక్షంలో టీడీపీలో చేరుతున్న చెర్లోపాలెం ఎస్సీకాలనీ వాసులు

కందుకూరు, ఏప్రిల్ 5: వలేటివారిపాలెం మండలం చెర్లోపాలెం ఎస్సీ కాలనీకి చెందిన 10 కుటుంబాల వారు కందుకూరు నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో శుక్రవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. నత్తా సింగయ్య, నత్తా రామారావు, కసుకుర్తి లక్ష్మీనారాయణ, లింగాబత్తిన మాల్యాద్రి, దాసరి సింగయ్య, పులి మోషే తదితరులు వైసీపీకి రాజీనామా చేసి స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వారందరికీ నాగేశ్వరరావు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

అలాగే ఉలవపాడు మండలం కరేడు పంచాయతీలోని కొత్త పల్లెపాలెం గ్రామానికి చెందిన పల్లెకారుల కుటుంబాల వారు గొల్లపోతు సురేష్ ఆధ్వర్యంలో వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. వారంతా కందుకూరుకు తరలివచ్చి స్థానిక పార్టీ కార్యాలయంలో కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో టీడీపీలో చేరగా వారందరికీ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు.

పెద్ద మసీదులో ఇంటూరి ప్రార్థనలు

పట్టణంలోని పెద్ద మసీదులో టీడీపీ, బీజేపీ, జనసేనల ఉమ్మడి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు శుక్రవారం రాత్రి ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనలు చేశారు. ముస్లిం సోదరులు ఏర్పాటుచేసిన ఇఫ్తార్‌విందులో పాల్గొన్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు పిడికిటి వెంకటేశ్వర్లు, షేక్ సలాం, షేక్ రఫి, ఖలీల్, ఫిరోజ్, నజీర్, మున్నా, రూబి, ఫాజిల్, వలీబాషా, సుల్తాన్, కాలేషా, షాకీర్ పాల్గొన్నారు.

1వ వార్డులో ఇంటింటి ప్రచారం



కందుకూరు టీడీపీ, జనసేన, బీజేపీల ఉమ్మడి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు, ఆయన సతీమణి సౌజన్యలు శుక్రవారం రాత్రి పట్టణంలోని 1వ వార్డు ఎర్రగుంటపాలెంలో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. టీడీపీ మినీ మ్యానిఫెస్టోలో ప్రకటించిన భవిష్యత్తుకు గ్యారంటీ సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన కల్పిస్తూ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావులకు సైకిల్ గుర్తుపై ఓటువేసి గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. రామాలయంలో పూజలు అనంతరం ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

సాయం చేసిన చేతిని మరువమయ్యా...!


పసుపులేటితో మాట్లాడుతున్న వృద్ధురాలు

బిట్రగుంట, ఏప్రిల్ 5: ఇరుకులు... ఇబ్బందుల్లో ఉన్నప్పుడు ఆదుకుని సాయం చేసిన చేతిని మరువమయ్యా... అన్ని ఓ వృద్ధురాలు పసుపులేటి సుధాకర్ చేయిపట్టుకుని ఆప్యాయంగా పలుకరించింది. శుక్రవారం బోగోలు పంచాయతీ చెంచులక్ష్మీపురంలో స్వతంత్ర అభ్యర్థిగా కావలి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేస్తున్న పసుపులేటి సుధాకర్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అమ్మ, పిన్ని, బాబాయ్, అత్త, మామ, అన్న, తమ్ముడూ.. అంటూ పలకరిస్తూ ఇళ్ల వద్దకు వెళ్తున్న పసుపులేటికి ఆనందోత్సాహంతో స్థానికులు స్వాగతం పలికారు. కోవిడ్ సమయంలో ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండగా ఇళ్ళకు కూరగాయలు తదితర వస్తువులు పీఎస్ఆర్ ట్రస్ట్ సభ్యుల ద్వారా పంపించి ఆదుకున్నావని కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పసుపులేటి వేంకటేశ్వర్లు, అంథోని, జగదీష్, పసుపులేటి కృష్ణ, శ్రీహరినాయుడు, శ్రీనివాసులురెడ్డి, వెంకటరమణయ్య, షబ్బీర్, మాబాషా, సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

- **ముస్లింల ఆత్మీయ సత్కారం**

కావలిటౌన్ : ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న పీఎస్సార్ ట్రస్ట్ అధినేత పసుపులేటి సుధాకర్‌కు ముసునూరు ముస్లిం సోదరులు శుక్రవారం ఆత్మీయ సత్కారం చేశారు. పసుపులేటి మాట్లాడుతూ ముస్లింలు సామాజికంగా వెనుకబాటుతనంలో ఉన్నారని, వారికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తున్నానన్నారు.

సర్వేపల్లి కాపాడుకునేందుకు స్వచ్ఛందంగా వస్తున్నారు

● టీడీపీ జాతీయ పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి

ముత్తుకూరు, ఏప్రిల్ 5: వైసీపీ ప్రభుత్వం.. మంత్రి కాకాణి రాక్షస పాలన నుంచి సర్వేపల్లిని కాపాడుకునేందుకు ప్రజలు స్వచ్ఛందంగా తరలి వస్తున్నారని టీడీపీ జాతీయ పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. ముత్తుకూరులో శుక్రవారం వైసీపీని వీడి టీడీపీలోకి చేరిన మాజీ ఉపసర్పంచ్ సుంకర శ్రీనివాసులుతో పాటు 40 కుటుంబాలను ఆత్మీయంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదేళ్ల కాకాణి అరాచక పాలనను నియోజకవర్గ ప్రజలు, ప్రధానంగా ముత్తుకూరు మండల ప్రజలు తీవ్రంగా అన్యాయమై పోయినట్లు చెప్పారు. పరిశ్రమల కాలుష్యంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని, కాకాణి ధన దాహానికి కంటైనర్ టెర్మినల్ పోవడంతో రూ.10వేల కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. కృష్ణపట్నం పోర్టు థర్మల్ పామాయిల్ ఇతర పరిశ్రమల్లో స్థానికులకు 75శాతం ఉద్యోగాలంటూ ఊదరగొట్టిన కాకాణి అక్రమ వసూళ్ల దందాలకే పరిమితయ్యారన్నారు. తాము అధికారంలోకి రాగానే కాకాణి, అతని అనుచరుల అక్రమ దందాలను విచారించి ప్రజలకు న్యాయం చేస్తామన్నారు. మత్స్యకారేతర ప్యాకేజీలో మిగిలిన మొత్తాన్ని అందరికీ పంపిణీ చేస్తామన్నారు. అనంతరం స్థానిక మసీదులో ముస్లిం పెద్దలు, మైనారిటీ నాయకులు ఇచ్చిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బొమ్మి సురేంద్ర, టీడీపీ మండల అధ్యక్షులు పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, నాయకులు మునిరెడ్డి, మల్లికార్జున యాదవ్, కోదండయ్య, శ్రీనివాసులు, ఏడుకొండలు, మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.


టీడీపీలోకి మాజీ ఉపసర్పంచ్ సుంకరను ఆహ్వానిస్తున్న సోమిరెడ్డి

కాకాణికి కౌంట్ డౌన్ స్టార్ట్

వెంకటాచలం : సర్వేపల్లి నియోజకవర్గంలో కాకాణి గోవర్ధన్‌రెడ్డికి కౌంట్ డౌన్ స్టార్ట్ అయ్యిందని మే 13 తర్వాత అతను ఇంటికి వెళ్లడం ఖాయమని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. నెల్లూరు వేదాయపాళెంలోని సోమిరెడ్డి కార్యాలయంలో చవటపాళెం పంచాయతీకి చెందిన వైసీపీ కీలక నాయకులు కుడితిపూడి మురళీధర్‌నాయుడు, కుడితిపూడి వెంకటేష్, కుడితిపూడి శ్రీనివాసులు, అశోక్, పృథ్వి సహా మరికొంత మంది వైసీపీ నాయకులు, 20కుటుంబాలు మాజీ మంత్రి సోమిరెడ్డి సమక్షంలో వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్, వల్లూరు రమేష్ నాయుడు, మావిళ్లపల్లి శ్రీనివాసులు నాయుడు, మెదరమెట్ల కోదండయ్య నాయుడు, తాటిపర్తి వేణు, తాళ్లపాక సునీల్ ఉన్నారు.

ఘనంగా జగజ్జీవన్‌రామ్ జయంతి

సైదాపురం, ఏప్రిల్ 5: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సర్కిల్ సమీపంలో దళిత అభివృద్ధి సేవా సంస్థ సభ్యులు జగజ్జీవన్ రామ్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు మల్లవరపు పెంచలయ్య, ఉపాధ్యక్షుడు రమణయ్య, ఎంపీటీసీ రమణ, మాజీ ఎంపీటీసీ ఈశ్వరయ్య, సంస్థ సభ్యులు కనుపూరు మస్తాన్, పొట్టేళ్ల ప్రభాకర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


బాబూ జగజ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

కోవూరు: దివంగత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు శుక్రవారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఇంతా మల్లారెడ్డి, ధారా విజయబాబు, నాటకరాని వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

కొడవలూరు: మండలంలో శ్రీవెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో జగజ్జీవన్‌రాం జయంతి వేడుకల్లో భాగంగా ఆయన చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి అనీల్ కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


పొదలకూరు: పూలమాల వేసి నివాళులర్పిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

పొదలకూరు: రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు శుక్రవారం బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు విశ్రాంత ఉద్యోగులు జగ్జీవన్‌రామ్ స్వాతంత్ర్య సమరయోధుడుగా, సంఘసంస్కర్తగా, దేశ ఉపప్రధానిగా, వివిధ శాఖల కేంద్ర మంత్రిగా ఆయన చేసిన సేవల గురించి కొనియాడారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కె.కోటేశ్వరరావు, గౌరవాధ్యక్షుడు షేక్ మస్తాన్ సాహెబ్, కార్యదర్శి కేవీఎల్.నారాయణ, కోశాధికారి మస్తానయ్య, సభ్యులు కె.వెంకటకృష్ణయ్య, జి.నారాయణరెడ్డి, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

వెంకటాచలం: గొలగమూడి సమీపంలోని మహాత్మజ్యోతిరావు పూలే గురుకుల బాలికల పాఠశాలలో శుక్రవారం డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ దమ్ము కొండలరావు ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మిసునీత, సుమవల్లి, సుజాత, సుస్మిత తదితరులున్నారు.

కాకుటూరు వద్ద ఉన్న విక్రమ సింహపురి యూనివర్సిటీలో శుక్రవారం స్వాతంత్ర్య సమరయోధుడు బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించారు. వీసీ సుందరవల్లి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రామచంద్రారెడ్డి, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ విజయానంద్‌కుమార్‌బాబు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ అల్లం ఉదయ్ శంకర్, డాక్టర్ కే విద్యాప్రభాకర్ ఉన్నారు.


జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న వీసీ సుందరవల్లి

మీ ఆడపడుచుగా వచ్చా ఆశీర్వదించండి : ప్రశాంతిరెడ్డి

● కుడితిపాలెం, రాముడుపాలెంలలో ప్రచారం

ఇందుకూరుపేట, ఏప్రిల్ 5 : మీ ఆడపడుచుగా మీ ముందుకు వచ్చా.. ఆశీర్వదించి శాసన సభకు పంపాలని కోవూరు టీడీపీ కూటమి అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కోరారు. శుక్రవారం కుడితిపాలెం, రాముడుపాలెం నుంచి ఆమె ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని అన్ని కాలనీలలో అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ప్రచారాన్ని కొనసాగించారు. స్థానిక ఆలయాలను సందర్శించారు. రంజాన్ సందర్భంగా ముస్లిం పెద్దలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుడితిపాలెం, రాముడుపాలెంలలో ప్రధానంగా ఉన్న తాగు, సాగునీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి పెడతానన్నారు. రహదారులు, మసీదుకు మరమ్మతులు తదితర సమస్యలను తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పరిష్కరిస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఈ ప్రచారంలో మండల టీడీపీ అధ్యక్షుడు రావి వీరేంద్రచౌదరి, చెంచుకిషోర్ యాదవ్, దువ్వూరు కల్యాణ్‌రెడ్డి, గుడి హరికుమార్‌రెడ్డి, మునగాల రంగారావు పాల్గొన్నారు.


ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ప్రశాంతిరెడ్డి

ప్రశాంతిరెడ్డి విజయానికి కృషి చేయాలి

కోవూరు, ఏప్రిల్ 5: వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని గెలిపించాల్సిందిగా ఆమె కుమారుడు డాక్టర్ అర్జున్‌రెడ్డి కోరారు. మైథిలీ కూడలి సమీపంలో శుక్రవారం జరిగిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. విందు అనంతరం ఆయన పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. తన తల్లి ప్రశాంతిరెడ్డి గెలుపు కోసం అందరూ కృషి చేయాల్సిందిగా కోరారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడ్ని ఎన్నుకోవాలన్నారు. ఇఫ్తార్ విందులో టీడీపీ నాయకులు చేజర్ల వేంకటేశ్వర్లురెడ్డి, కాటంరెడ్డి కృష్ణారెడ్డి, గాదిరాజు సుధాకర్, షేక్ జమీర్, నిశార్ గౌస్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే దేశాభివృద్ధి : నెట్రంబాక

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 5: కాంగ్రెస్ పార్టీతోనే దేశం, రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని మాజీ జొన్నవాడ ఆలయ ట్రస్టీ, కోవూరు నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నెట్రంబాక మోహన్ అన్నారు. శుక్రవారం ఆయన జొన్నవాడ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి వారిని దర్శించుకున్నారు. అనంతరం మొదటగా జొన్నవాడ నుంచి ప్రచారం ప్రారంభించి ఓటర్లను ఓట్లు అభ్యర్థించారు. అత్యధిక మెజారిటీతో కోవూరు ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఆయన వెంట స్టేట్ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ గణేష్‌బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు కిషోర్‌రెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ నాయకుడు డి మోహన్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మంజుల, బుచ్చి మండల అధ్యక్షుడు కిషోర్, మహేష్, పలువురు మహిళలు తదితరులు పాల్గొన్నారు.


ఎన్నికల ప్రచారం ప్రారంభించిన కోవూరు నియోజకవర్గం కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి నెట్రంబాక మోహన్

పేదల పక్షాన నిలబడే పార్టీ కాంగ్రెస్

తోటపల్లిగూడూరు: పేదల పక్షాన నిలబడి వారి గురించి ఆలోచించే కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని సర్వేపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి పూల చంద్రశేఖర్ ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన కాటేపల్లి, మండపం, ఈదురువారిపాలెం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం చంద్రశేఖర్ మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ప్రతి పేద కుటుంబానికి ప్రతినెలా 1వ తేదీ రూ.5వేలు ఇస్తామని అలాగే ప్రత్యేక హోదా కోసం పోరాడుతామన్నారు. ప్రతి ఇంటికి తిరిగి ప్రజలకు పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గడ్డె కిషోర్, పార్టీ నాయకులు ఉప్పల మస్తానయ్యగౌడ్, సుబ్రహ్మణ్యం, శివయ్య, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రెండోపంట ప్రయత్నాలు విరమించుకోవాలి : డీఈఈ

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 5: రైతులు రెండో పంట ప్రయత్నాలు విరమించుకోవాలని నీటిపారుదల శాఖ డీఈఈ మధు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కొందరు రైతులు రెండోపంట సాగు ప్రయత్నాలలో ఉన్నట్టు తెలుస్తోందనీ, ప్రస్తుతం కనిగిరి రిజర్వాయర్‌లో నీరు తాగు అవసరాలకు మాత్రమే సరిపోతుందని, సాగుకు విడుదల చేయడానికి వీలుకాదన్నారు. కనిగిరి రిజర్వాయర్ ఆయకట్టు రైతాంగం రెండవ పంట ప్రయత్నాలను విరమించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

న్యాయవాది పులి బలరామయ్య మృతి



నెల్లూరు (లీగల్), ఏప్రిల్ 5 : ప్రముఖ న్యాయవాది పులి బలరామయ్య శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. నిరుపేద కుటుంబంలో పుట్టిన ఆయన వామపక్ష భావజాలానికి ఆకర్షితుడై అనేక ప్రజాతంత్ర ఉద్యమాలలో పాల్గొన్నారు. పేదల పక్షాన నిలబడి అనేక కేసులు వాదించారు. సీపీఎం కోరిక మేరకు ఒకదఫా సర్వేపల్లి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికల్లో పోటీ చేశారు. 50 ఏళ్లకు పైబడి న్యాయవాద వృత్తిలో ఉన్న ఆయన నిబద్ధత కలిగిన న్యాయవాదిగా పేరుపొందారు. బలరామయ్య మృతికి రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ వేనాటి చంద్రశేఖర్ రెడ్డి, నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పీ ఉమామహేశ్వర్ రెడ్డి, పీ సుందరయ్య యాదవ్, అల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా కమిటీ సంతాపం తెలిపింది.

ఉగాది పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 5 : జేసీఐ, జేఏసీ సంయుక్తంగా శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు ఈనెల 9వ తేదీ నిర్వహిస్తున్నట్లు జేఏసీ నేషనల్ ఛైర్మన్ కోట సూర్యనారాయణ తెలిపారు. శుక్రవారం నగరంలోని ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజసేవ, విద్య, వైద్యం, సాహిత్యం, శాస్త్రీయ సంగీతం, నృత్యం, యోగా, క్రీడలు, ఇతర రంగాలలో ప్రతిభ పాటవాలు కలిగినవారికి పురస్కారాలు అందజేస్తామని చెప్పారు. ఆయా రంగాల్లో ప్రతిభావంతులు దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 93914 91052 నెంబరును సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ ఛైర్మన్ సీవీ శరణ్‌కుమార్, యోగా థెరపిస్ట్ ప్రసన్నకుమార్ తెలిపారు.

ఎన్‌డీఏ కూటమి వస్తేనే వలంటీర్లకు న్యాయం : వేమిరెడ్డి

నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 5 : ఎన్‌డీఏ కూటమి వస్తేనే వలంటీర్లకు న్యాయం జరుగుతుందని టీడీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వలంటీర్లను రెచ్చగొట్టడం ద్వారా ప్రస్తుత ప్రభుత్వం రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోందని విమర్శించారు. సచివాలయ వ్యవస్థకు తెలుదేశంపార్టీ వ్యతిరేకం కాదని, వైసీపీ కోసం రాజకీయాలు చేసే వలంటీర్లను మాత్రమే టీడీపీ వ్యతిరేకిస్తోందన్నారు. వచ్చే ఎన్‌డీఏ ప్రభుత్వంలో వలంటీర్లకు తప్పకుండా న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సచివాలయ ఉద్యోగుల ద్వారా పెన్షన్లు పంపిణీ చేసే అవకాశం ఉన్నా, ఎందుకు చేయటం లేదని ప్రశ్నించారు. ప్రతి పక్షాలను దూషించేందుకు వైసీపీ పింఛన్లలను నిలిపివేసిందని ఆయన ఆరోపించారు.

జగ్జీవన్‌రామ్ మహోన్నతులు

● విద్యాశాఖ జేడీ రామలింగం ● వాడవాడలా జయంతి వేడుకలు

నెల్లూరు (విద్య) ఏప్రిల్ 5 : బహుజనుల కోసం నిరంతరం శ్రమించి వ్యవసాయ కార్మిక చట్టాల రూపకల్పనకు ఎంతో కృషి చేసిన మహోన్నత వ్యక్తి జగ్జీవన్‌రామ్ అని విద్యాశాఖ జేడీ మువ్వా రామలింగం కొనియాడారు. స్వాతంత్ర్య సమరయోధుడు, భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని శుక్రవారం నగరంలోని దర్గామిట్ట బాలుర జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీఈవో రామారావు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.


టీడీపీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న నాయకులు

● బొల్లినేని ఆసుపత్రి సమీపంలో ఉన్న మునిసిపల్ కార్పొరేషన్ ప్రైమరీ పాఠశాలలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి బహుజన టీచర్స్ అసోసియేషన్ నేతలు నివాళులర్పించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టేటి రమేష్, అసోసియేట్ ప్రెసిడెంట్ పల్లం వేణుగోపాల్, ఆర్థిక కార్యదర్శి ఆదినారాయణ, ఉపాధ్యక్షుడు మనోజ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి మాసా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయంలో...

నెల్లూరు (వీఆర్సీ) : తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కాకి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు దళిత నాయకులు మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు ప్రతి దళితుడు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి మాతంగి కృష్ణ, రూరల్ అధ్యక్షుడు ఉయ్యాల జగన్, నగర అధ్యక్షుడు అరవ కిశోర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శైలేంద్రబాబు, ఇశ్రాయేలు, పెంచలయ్య, రాము పాల్గొన్నారు.

హక్కుల సాధకుడు : సోమిరెడ్డి

జగ్జీవన్‌రామ్ అన్ని సామాజిక వర్గాలకు సమాన హక్కుల కోసం పోరాడిన మహోన్నతుడని సర్వేపల్లి టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. నగరంలోని వేదాయపాళెం కూడలిలో గల జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు జన్ని రమణయ్య, బద్దెపూడి నరసింహగిరి, మాతంగి కృష్ణ, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు

ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నగరంలో జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య మాదిగ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే పాఠశాలలోని అంటరానితనాన్ని జగ్జీవన్‌రామ్ ప్రశ్నించారన్నారు. కార్యక్రమంలో కుడుముల సుబ్బారావు, చిన్నయ్య, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● ఎమ్మార్పీఎస్ నాయకుల ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా అధ్యక్షుడు సూరిపాక ఉదయ్ కృష్ణ, సూరిపాక వాసుదేవ రావు, పందిటి అంబేడ్కర్, మంద పెంచలయ్య మాదిగ, శ్రీనివాస్, ఏలియా, కుమారి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు చీరల పంపిణీ

నగరంలోని శోధన్‌నగర్‌లో గల జగ్జీవన్‌రామ్ భవన్‌లో కుడుముల సుబ్బారావు ఆధ్వర్యంలో జయంతి వేడుకలు జరిగాయి. పేద మహిళలకు చీరలు పంచిపెట్టారు. కార్యక్రమంలో సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవ స్థాపక అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య మాదిగ, డేగా రవి రాఘవేంద్ర, కాకి శ్రీనివాసులు, గడ్డం శేఖర్, గాయకులు వేగూరు విజయకుమార్, అంకి మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

సమసమాజ స్థాపనకు జగ్జీవన్‌రామ్ కృషి

● నగర టీడీపీ అభ్యర్థి నారాయణ

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 5 : సమసమాజ స్థాపనకు కృషి చేసిన మహనీయుడు బాబూ జగ్జీవన్‌రామ్ అని రాష్ట్ర మాజీ మంత్రి, నగర టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పొంగూరు నారాయణ అన్నారు. నగరంలోని 10వ డివిజన్ అరుంధతీయపాళెం దళిత సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. జగ్జీవన్‌రామ్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, టీడీపీ నాయకుడు తిరుమల నాయుడు, దళిత సంఘాల నేతలు బల్లాల రమేష్, వెంకటేశ్వర్లు, వెంకట్రావు, పెంచలయ్య, క్లస్టర్ ఇన్‌చార్జి కువ్వారపు బాలాజీ తదతరులు పాల్గొన్నారు.


జగ్జీవన్‌రామ్‌కు పుష్పాంజలి ఘటిస్తున్న నారాయణ

● ఉపాధ్యాయ ఉద్యమ పితామహుడు వీణా విజయరామరాజు వర్థంతి, బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమాలను ఎస్‌టీయూ ఆధ్వర్యంలో సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు వై అశోక్‌బాబు, ప్రధాన కార్యదర్శి జీ రాజమనోహర్, సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

● కొండాయపాళెంలోని నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాలలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి హెచ్ఎం భాస్కర్‌రావు నివాళర్పించారు.

ఎస్పీ ఘన నివాళి

నెల్లూరు(క్రైం): జిల్లా పోలీసు కార్యాలయంలో మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్‌కు ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ ఘనంగా నివాళులు అర్పించారు. మానవతావాదం, ఆదర్శవాదం వంటి పలు సద్గుణాలు కలిగిన మహోన్నత వ్యక్తి జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు.



కమిషనర్ నివాళి

నెల్లూరు(సిటీ): జగ్జీవన్‌రామ్ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ వికాస్ మర్మత్ నివాళి అర్పించారు. దేశానికి, అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలను కొనియాడారు.

డీసీవో కార్యాలయంలో...

నెల్లూరు(హరనాథపురం) : జిల్లా సహకారశాఖాధికారి కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు జరిగాయి. సహకారశాఖ ఉద్యోగులు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. డీసీవో గురప్ప, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ప్రభాకర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో...

నెల్లూరు (వైద్యం): ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ గంగాధర్ ఆధ్వర్యంలో అధికారులు, వైద్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కాలేషాబాషా, జీజీహెచ్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కళారాణి, వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్‌కు సెంట్రీఫ్యూజ్ పరికరం వితరణ

నెల్లూరు(వైద్యం), ఏప్రిల్ 5 : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రక్తనిధికి విర్కో ఫౌండేషన్ సీఈవో తిరుమూరు ప్రవీణ సెంట్రీఫ్యూజ్ కాంపోనెంట్ సెపరేటర్‌ను శుక్రవారం వితరణ చేశారు. రూ.42 లక్షల విలువ చేసే ఈ పరికరంతోపాటు రక్తంలోని ప్లాస్మాకు సంబంధించి కిట్స్, ఇతర పరికరాలు కూడా అందచేస్తామని తెలియచేశారు. రెడ్‌క్రాస్ రాష్ట్ర సమన్వయ అధికారి బీవీఎస్ కుమార్ నగరంలోని రక్తనిధితోపాటు కేన్సర్ ఆసుపత్రిని పరిశీలించానని ఆయా విభాగాలకు అన్ని విధాలా సహకారం అందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కన్వీనర్ అజయ్‌బాబు, జిల్లా కార్యదర్శి మస్తానయ్య, మెర్ట్ కన్వీనర్ సాయిరామ్, ఎస్ఎస్‌జీ మెడికల్ కన్వీనర్ మురళీకృష్ణ పాల్గొన్నారు.



చుట్టపుచూపుగా వచ్చే ఎమ్మెల్యేలు మనకొద్దు

● అల్లీపురంలో సోమిరెడ్డితో కలిసి కోటంరెడ్డి ప్రచారం

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 5 : నెలలో ఒక్క రోజు చుట్టపుచూపుగా వచ్చే ఎమ్మెల్యే మనకొద్దని, నియోజకవర్గంలో ప్రజలను కనిపెట్టుకుని ఉండే ప్రజాప్రతినిధులను ఎన్నుకోవాలని నెల్లూరు రూరల్ టీడీపీ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం అల్లీపురంలో మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తనకు, తన కుటుంబానికి రెండు సార్లు కరోనా వచ్చినా ప్రజా సేవలోనే ఉన్నానని గుర్తు చేశారు. ప్రస్తుతం వైసీపీ అభ్యర్థిగా ఉన్న ఆదాల కనీసం కరోనా సమయంలో నియోజకవర్గం వైపు కన్నెత్తి చూడలేదని విమర్శించారు. సోమిరెడ్డి మాట్లాడు తూ ఈసారి జగన్‌మోహన్‌రెడ్డిని ఎన్నుకుంటే రాష్ట్రం అధోగతిపడుతుందన్నారు. జూన్ 4వ తేదీ వరకు ఎవరూ మద్యం తాగవద్దని పిలుపునిచ్చారు.


అల్లీపురంలో అభివాదం చేస్తున్న కోటంరెడ్డి, సోమిరెడ్డి

టీడీపీలో చేరికలు

రూరల్ నియోజకవర్గంలోని 26వ డివిజన్ వైసీపీ ఇన్‌చార్జి, మాజీ కార్పొరేటర్ మల్లెబోయిన వెంకటేశ్వర్లుయాదవ్, 29వ డివిజన్‌కు చెందిన దయాకర్ ముదిరాజ్, వారి మిత్రబృందాలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నివాసంలో కోటంరెడ్డి సోదరుల సమక్షంలో టీడీపీలో చేరారు. 29, 17 డివిజన్లకు చెందిన పలువురు కూడా టీడీపీలో చేరారు. మండలంలోని గొల్లకందుకూరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ తాటిపర్తి రమణయ్య, వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. అనంతరం కార్యాలయంలో జరిగిన డాక్టర్ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకల్లో కోటంరెడ్డి సోదరులు ఆయనకు ఘన నివాళి అర్పించారు.

ముస్లింల ఉన్నతికి టీడీపీ కృషి

● పొంగూరు నారాయణ, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 5 : తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలోనే ముస్లింలకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశామని, భవిష్యత్‌లో కూడా మైనార్టీల ఉన్నతికి టీడీపీ కృషి చేస్తుందని టీడీపీ నగర ఎమ్మెల్యే అభ్యర్థి పొంగూరు నారాయణ, నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి హామీ ఇచ్చారు. నగరంలోని 42వ డివిజన్ జెండావీధి షాదీమంజిల్‌లో శుక్రవారం నిర్వహించిన ఇఫ్తార్ విందులో వారు పాల్గొన్నారు. ఐదువేల మంది ముస్లింలతో ఇఫ్తార్ విందులో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం అరాచక పాలన సాగుతోందని, వైసీపీ నాయకుల తీరు దుర్మార్గంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు పార్లమెంట్ నియోజక వర్గం టీడీపీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, నారాయణ విద్యా సంస్థల జీఎం విజయ భాస్కర్‌రెడ్డి, మైనార్టీ నేతలు పాల్గొన్నారు.


ఇఫ్తార్ విందులో నారాయణ, వేమిరెడ్డి తదితరులు

శాంతి స్వరూప్ మృతికి సంతాపం

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 5 : తొలి తెలుగు న్యూస్ రీడర్ శాంతిస్వరూప్ మరణ వార్త తనను ఎంతో కలిచివేసిందని తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శాంతి స్వరూప్ న్యూస్ రీడర్‌గా ప్రత్యేక గుర్తింపు పొందారని, నేటి న్యూస్ రీడర్స్‌కి ఆయన ఆదర్శం అన్నారు. శాంతిస్వరూప్ ఆత్మకు శాంతికలగాలని భగవంతుని ప్రార్థిస్తూ ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

సర్వేపల్లిలో టీడీపీలో చేరికలు

నెల్లూరు(వ్యవసాయం), ఏప్రిల్ 5 : సర్వేపల్లి నియోజవర్గంలో వైసీపీకి చెందిన పలు కుటుంబాలు శుక్రవారం నెల్లూరు వేదాయపాళెంలోని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కార్యాలయంలో ఆయన సమక్షంలో టీడీపీలో చేరారు. మనుబోలు మండలం వీరంపల్లి పంచాయతీకి చెందిన 14 కుటుంబాలు సైకిల్ తీర్థం పుచ్చుకున్నాయి. వెంకటాచలం మండలం చౌటపాళెం పంచాయితీకి చెందిన 20 కుటుంబాలు టీడీపీలో చేరాయి.

ఇండియన్ ప్రోస్తోడాంటిక్స్ సొసైటీ అధ్యక్షుడిగా డాక్టర్ విజయశంకర్



నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 5 : ఇండియన్ ప్రోస్తోడాంటిక్స్ సొసైటీ జిల్లా అధ్యక్షుడిగా ప్రముఖ దంత వైద్య నిపుణుడు డాక్టర్ విజయశంకర్ యాదవ్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. శుక్రవారం నగరంలోని ఓ హోటల్‌లో జరిగిన ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో జిల్లా అధ్యక్షుడితోపాటు కార్యదర్శిగా డాక్టర్ భవన్‌చంద్, కోశాధికారిగా డాక్టర్ సందీప్, సంపాదకుడిగా డాక్టర్ సుధీర్‌ను ఎంపిక చేశారు. సొసైటీ జాతీయ కార్యదర్శి డాక్టర్ జంగాల హరి, సంయుక్త కార్యదర్శి డాక్టర్ శేషారెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సుధీర్ సజ్జన్ పాల్గొన్నారు. దంత వైద్య రంగంలో ప్రతిభ చూపిన వైద్యులకు పురస్కారాలు అందచేశారు.

ఈసీ మార్గదర్శకాలను అనుసరించండి

- కలెక్టర్ ప్రవీణ్‌కుమార్


కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌కు శుభాకాంక్షలు చెబుతున్న ఎస్పీ తదితరులు

సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి నిబద్ధతతో పనిచేయాలని జిల్లా యంత్రాంగాన్ని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ సూచించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం ప్రతి ఒక్కరూ పనిచేయాల్సి వుందన్నారు.శుక్రవారం కలెక్టరేట్‌లో ఈఆర్వో, ఏఈఆర్వో,నోడల్ అధికారులతో ఆయన సమీక్షించారు. పోలింగ్ కేంద్రాల్లో కనీస మౌలిక సదుపాయాలు ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డీఆర్వో కిషోర్, ఈఆర్వోలు ధ్యానచంద్ర, ఆదితిసింగ్, నిశాంత్‌రెడ్డి, రామమోహన్ తదితరులు పాల్గొన్నారు. కాగా గురువారం రాత్రి ఒంటిగంటకు కలెక్టరుగా బాధ్యతలు తీసుకున్న కలెక్టర్‌ను శుక్రవారం పలువురు అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.వీరిలో జేసీ ధ్యానచంద్ర, ఎస్పీ కృష్ణకాంత్‌పటేల్,కమిషనర్ ఆదితిసింగ్, డీఆర్వో పెంచలకిషోర్, డీఎంహెచ్‌వో శ్రీహరి తదితరులున్నారు.

- తిరుపతి(కలెక్టరేట్)

ఇది కోడ్ ఉల్లంఘన కాదా?



ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి మూడు వారాలవుతోంది. ప్రజాప్రతినిధులు ఎవరూ జనాన్ని ప్రలోభపెట్టే పనులు కానీ, ఆకర్షించే పనులు కానీ చేయకూడదని ఎన్నికల నియమావళి చెబుతోంది.అయితే అక్కడక్కడా కోడ్ ఉల్లంఘనలు జరుగుతూనే వున్నాయి. తాజాగా శ్రీకాళహస్తి పట్టణంలోని ముస్లింలకు రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని పెద్దమసీదు వద్ద ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం శుక్రవారం స్వీట్‌బాక్సులు పంచిపెట్టారు.ముక్కంటి ఆలయ ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు, జనార్దన రావు జె.పవార్, వడ్ల తాంగళ్ బాలాజీ ప్రసాద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.మరి ఈ కార్యక్రమం కోడ్ ఉల్లంఘనో, కాదో అధికారులే తేల్చాల్సివుంది.

- శ్రీకాళహస్తి

టీడీఆర్ బాండ్ల నిలిపివేతపై కలకలం

- గత నెల 23నే పురపాలక శాఖ ఉత్తర్వులు

అప్పటికే 75శాతం బాండ్లు వినియోగం

తిరుపతి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : ట్రాన్స్‌ఫర్‌బుల్ డెవలప్‌మెంట్ రైట్ (టీడీఆర్) బాండ్ల చెల్లుబాటు నిలిపివేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కలకలం రేపింది. లావాదేవీలకు నోచుకోని టీడీఆర్ బాండ్లు చెల్లవంటూ గత నెల 23న పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి జారీ చేసిన ఉత్తర్వులు ఆలస్యంగా వెలుగులోకి రావడంతో ఉత్తర్వుల నాటికి బాండ్లను వినియోగించుకోని వారి గుండెల్లో గుబులు రేగింది. ఎక్కువ సంఖ్యలో రోడ్లను నిర్మించి తద్వారా టీడీఆర్ బాండ్లు జారీచేసి, పెద్దమొత్తంలో లబ్ధి పొందాలని భావించిన వైసీపీ నేతల ఆలోచనలకు తాజా ఉత్తర్వులతో బ్రేకు పడింది. తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో పెద్దమొత్తంలో టీడీఆర్ బాండ్ల దోపిడీ జరిగిందని విపక్షాలు ఆరోపించడంతో పాటు, మీడియాలో పెద్దఎత్తున కథనాలు వచ్చిన నేపథ్యంలో శ్రీలక్ష్మి రెండు నెలల క్రితమే విచారణకు ఆదేశించింది. అయితే ఈ విషయమై తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ నుంచి ఎలాంటి నివేదిక పంపకపోగా అధికార పార్టీకి చెందిన కీలక నేతలు ఆమెపై విరుచుకుపడ్డట్టు తెలుస్తోంది. దీంతో ఆగ్రహించిన ఆమె ఏకంగా టీడీఆర్ బాండ్ల చెల్లుబాటును నిలిపివేస్తూ ఉత్తర్వులు ఇవ్వడం చర్చనీయాంశమైంది. తిరుపతిలో నిర్మించిన మాస్టర్‌ప్లాన్ రోడ్లకు ముందుగా సరైన సర్వే చేయకపోవడంతో పాటు కొన్ని చోట్ల దౌర్జన్యకరమైన పద్ధతుల్లో భూములు తీసుకుని హడావుడిగా రోడ్ల నిర్మాణం చేపట్టడం వివాదాస్పదమైన సంగతి తెలిసిందే.మున్సిపల్ కౌన్సిల్ ప్రతిపాదించిన మొత్తం 42 రోడ్లలో ఇప్పటివరకు నిర్మించిన 18 రోడ్లకు సంబంధించి 1121 మంది భూములు కోల్పోయారు. వీరిలో 373 మందికి టీడీఆర్ బాండ్లు జారీచేశారు. గొల్లవానిగుంట, కొర్లగుంట ప్రాంతాల్లో స్వల్పంగా భూములు కోల్పోయిన వారితో పాటు అధికార పార్టీకి అనుకూలంగా ఉన్న కొందరికి పెద్దమొత్తంలో బాండ్లు జారీ అయ్యాయి. ఇంకా 1200కు పైగా టీడీఆర్ బాండ్లు ఇవ్వాల్సి ఉంది.చదరపు గజానికి రూ.35వేల చొప్పున 2.80 లక్షల చదరపు గజాల స్వాధీనంతో కూడిన 342 టీడీఆర్ బాండ్ల జారీపై వివరణాత్మక నివేదికను సమర్పించాలని తిరుపతి కమిషనర్‌ను పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి ఆదేశించారు. మొత్తం రూ1,013 కోట్ల విలువైన టీడీఆర్ బాండ్లు జారీ చేసినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే ఉత్తర్వులు వెలువడే నాటికే 75 శాతం టీడీఆర్ బాండ్ల వినియోగం జరిగిపోయిందని కార్పొరేషన్ వర్గాలు చెబుతున్నాయి.టీడీఆర్ బాండ్ల చెల్లుబాటును పూర్తిగా రద్దు చేయలేదని తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు అవి చెల్లుబాటు కావని అంటున్నాయి. ఎక్కువ సంఖ్యలో రోడ్లను నిర్మించి తద్వారా టీడీఆర్ బాండ్లు జారీచేసి, పెద్దమొత్తంలో లబ్ధి పొందాలని భావించిన వైసీపీ నేతల పన్నాగానికి తాజా ఉత్తర్వులతో బ్రేకు పడిందనే భావించవచ్చు.

నడినెత్తిన నిప్పులు

- గూడూరు, శ్రీకాళహస్తిల్లో 42 డిగ్రీలు
- ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి


ఎండ దెబ్బకు నిర్మానుష్యంగా తిరుపతి బస్టాండు రోడ్డు, ఫ్లై ఓవర్

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 5: సూర్యుడు నిప్పులు కురిపిస్తున్నాడు.పగటి ఉష్ణోగ్రతలు అంతకంతకు పెరుగుతుండడంతో ఉదయం 8గంటలకే బయటకు అడుగు పెట్టలేని పరిస్థితి నెలకొంది. మండుతున్న ఎండలకు తోడు విద్యుత్ సరఫరా అంతరాయం కారణంగా జనం ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. శుక్రవారం జిల్లాలో అత్యధికంగా శ్రీకాళహస్తి,గూడూరు ప్రాంతాల్లో 42 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కాగా సూళ్ళూరుపేటలో 41డిగ్రీలు,తిరుపతిలో 39.6డిగ్రీలు నమోదయ్యాయి.ఎండ తీవ్రత ప్రభావం తిరుమల తదితర పుణ్యక్షేత్రాలపై కూడా పడింది.ఆలయాల్లో రద్దీ బాగా తగ్గిపోయింది.ఎన్నికలప్రచారంలో పాల్గొంటున్న నాయకులు, కార్యకర్తలు ఉదయం 6 నుంచి 11గంటల లోపు పని ముగించుకుని ఇళ్లకు చేరిపోతున్నారు. సాయంత్రం 4 గంటల తరువాతే ప్రచారం కోసం బయటకు అడుగుపెడుతున్నారు.


అలిపిరి వద్ద దాహం తీర్చుకుంటున్న వానరం



కూటమి విజయాన్ని ఆపలేరు

- వైసీపీ అరాచకాలు, అక్రమాలతో ప్రజలు విసిగిపోయారు
- తిరుపతి పార్లమెంట్ స్థాయి టీడీపీ, జనసేన, బీజేపీ సమావేశంలో నేతల ధ్వజం



తిరుపతి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ కూటమి అభ్యర్థుల విజయాన్ని ఎవరూ ఆపలేరని, ఎంపీ అభ్యర్థితో పాటు అన్ని స్థానాల్లో ఎమ్మెల్యే అభ్యర్థులు భారీ మెజారిటీతో గెలవబోతున్నారని టీడీపీ,బీజేపీ,జనసేన నేతలు స్పష్టం చేశారు. టీడీపీ అధిష్ఠానం ఆదేశాల మేరకు తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహ యాదవ్ అధ్యక్షతన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల సమావేశం శుక్రవారం తిరుపతిలో జరిగింది. ఎన్నికల సన్నద్ధత,బహిరంగ సభల నిర్వహణ, సోషల్ మీడియాలో అభ్యర్థుల ప్రచారం, ఎంపీ అభ్యర్థి మేనిఫెస్టోలతో పాటు స్థానిక సమస్యలపై చర్చించారు. అనంతరం మీడియతో నరసింహ యాదవ్ మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో కూటమి అభ్యర్థులు విజయ పతాకాన్ని ఎగరవేయనున్నారని చెప్పారు. పొత్తుల్లో భాగంగా కేటాయింపులు జరిగిన స్థానాల్లో కూటమి పార్టీలన్నీ ఏకతాటిపైకి వచ్చి అభ్యర్థి గెలుపుకోసం పనిచేయాలని స్పష్టం చేశారు. జనసేన పార్టీ అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ మాట్లాడుతూ ప్రజా జీవితాలను నాశనం చేస్తున్న వైసీపీ విధానాలను గమనించి పవన్ కళ్యాణ్ బీజేపీ, టీడీపీతో కలసి జట్టు కట్టారని, వైసీపీని తరిమి కొట్టాలని కంకణం కట్టుకున్నారన్నారు.జగన్ రెడ్డితో పాటు వైసీపీ ఎమ్మెల్యేలు చేస్తున్న అరాచకాలతో విసిగిపోయిన ప్రజలు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. బీజేపీ అధ్యక్షుడు చంద్రప్ప మాట్లాడుతూ దేశానికి మోదీ నాయకత్వం అవసరమని, రాష్ట్రాభివృద్ధికి బాటలు వేయాలంటే బీజేపీ గెలవాలన్నారు. జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ తిరుపతి, తిరుమలలో జరుగుతున్న అరాచకాలు చూసి ప్రపంచం నలుమూలల ఉన్న హిందూ సమాజం విస్తుపోతోందన్నారు. వైసీపీకి ఇవే చివరి రోజులన్నారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి వరప్రసాదరావు మాట్లాడుతూ దళితులను జగన్ రెడ్డి దారుణంగా వంచించారని మండిపడ్డారు. తానొక ఐఏఎస్ అధికారి అన్న విలువ కూడా ఇవ్వకుండా అవమానించారని ఆవేదన చెందారు. తనకన్నా జగన్ రెడ్డి ఏమంత గొప్ప అని ప్రశ్నించారు. రాబోయే ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించుకుని పవన్ కళ్యాణ్, చంద్రబాబు నాయుడు, మోదీలకు కానుకలుగా ఇద్దామన్నారు.శ్రీకాళహస్తి , సత్యవేడు నియోజకవర్గాల అభ్యర్థులు బొజ్జల సుధీర్ రెడ్డి, ఆదిమూలం, బీజేపీ నాయకులు భానుప్రకాష్ రెడ్డి, సామంచి శ్రీనివాస్, టీడీపీ నేతలు శ్రీధర్ వర్మ, డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

93శాతం పెన్షన్ల పంపిణీ

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 5: జిల్లాలో సామాజిక పెన్షన్ల పంపిణీ శుక్రవారం కూడా కొనసాగింది.95శాతం సచివాలయాల వద్దనే పెన్షన్లను పంపిణీ చేశారు. వికలాంగులకు, దీర్ఘకాలిక రోగులకు, మంచానికే పరిమితమైన వారికి ఇళ్ల వద్దే పింఛన్లు పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ క్షేత్రస్థాయిలో కొంతమందికి మాత్రమే సచివాలయ ఉద్యోగులు ఇళ్ల వద్దకు వెళ్లి పంపిణీ చేశారు. సచివాలయ సిబ్బందితో ఇంటింటికి పంపిణీ చేసే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా పింఛనుదారులు మండుటెండలో అష్టకష్టాలు పడి సచివాలయాలకు రావాల్సి వచ్చింది.శనివారంతో పింఛన్ల పంపిణీ ముగిస్తామని జిల్లా అధికారులు తెలిపారు. జిల్లాలో 2,71,477మంది పింఛనుదారులుండగా మూడు రోజుల్లో 2,53,804మందికి పంపిణీ చేసినట్లు వివరించారు. ఇక 17,673మంది మాత్రమే పెన్షన్లు తీసుకోవాల్సి వుందని అధికారులు తెలిపారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శనివారం) : సా. 6.28
సహరి (ఆదివారం) : ఉ. 4.45

బ్రాండెడ్ బీర్లు దాచేస్తున్నారు

- మందుబాబులకు జే బ్రాండ్లను అంటగడుతున్నారు





బ్రాండెడ్ బీరు - జె. బ్రాండ్ బీరు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 5 : వేసవి వచ్చిందంటే బీర్లకు సహజంగానే డిమాండ్ పెరుగుతుంది. ఎండలకు తట్టుకోలేక మద్యం ప్రియులు బీర్లు ఎక్కువగా తాగుతుంటారు. తిరుపతి జిల్లావ్యాప్తంగా ఉన్న 40 బార్లలో రోజుకు రూ.3 కోట్ల వ్యాపారం జరుగుతుంది. అయితే తాజాగా ఖజ్జూరా, నాక్ అవుట్, బడ్‌వైజర్, హేవార్డ్స్ 5000, కింగ్‌ఫిషర్, కార్ల్స్ బర్గ్ వంటి బ్రాండెడ్ బీర్లు ఎక్కడా కనిపించడం లేదు. తిరుపతిలోని 16 బార్లు, ప్రభుత్వ మద్యం షాపుల్లో బ్రాండెడ్ బీర్లు దొరకడమే గగనంగా మారింది. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బ్రాండెడ్ బీర్ల స్థానంలో జే బ్రాండ్‌గా పేరుపడ్డ ఫోస్టర్, బీరా, బూమ్, బ్లాక్ బస్టర్, ఎస్ఎన్‌జె, కింగ్ ఫిషర్ స్టాండర్డ్, బ్రిటిష్ ఎంపైర్, కింగ్‌ఫిషర్ అల్ట్రా, బడ్ వంటివి కనిపిస్తున్నాయి. వాటి ధరలు బ్రాండెడ్ బీర్లకు ఏ మాత్రమూ తగ్గడం లేదు. ఉదాహరణకు కింగ్ ఫిషర్ బీరు రూ.400 అనుకుంటే అదే జే బ్రాండ్ బీరు ఫోస్టర్, బూమ్ రూ.380కి విక్రయిస్తున్నారు.సరఫరా లేదనే పేరుతో నాసిరకం మద్యాన్నే అంటగడుతున్నారని మందుబాబులు ఆరోపిస్తున్నారు. దీనిపై ఎక్సైజ్ అధికారిని వివరణ కోరగా బ్రాండెడ్ బీర్ల ఉత్పత్తి తగ్గిపోయిన కారణంగానే సరఫరా తగ్గించామని చెప్పారు.

గోడౌన్లకు తరలించేస్తున్నారు

ఎన్నికల సీజన్ కావడంతో వైసీపీ నాయకులు బ్రాండెడ్ బీర్లను దాచేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.తిరుపతి, శ్రీకాళహస్తి,చంద్రగిరి వంటి ప్రాంతాల్లో కొందరు వైసీపీ నాయకులు పోటీపడి బ్రాండెడ్‌తో పాటు జే బ్రాండు బీర్లను కూడా లాట్‌గా కొనుగోలు చేసి, గోడౌన్లకు తరలిస్తున్నట్లు సమాచారం. తిరుపతి శివారు ప్రాంతాల్లో ఇలాంటి గోడౌన్లు ఎక్కువగా ఉన్నట్లు చెబుతున్నారు.

జామియా మసీదు అభివృద్ధికి కృషి : కురుగొండ్ల


ప్రార్థనలు నిర్వహిస్తున్న లక్ష్మీసాయి ప్రియ, కురుగొండ్ల

వెంకటగిరి, ఏప్రిల్ 5 : టీడీపీ అధికారంలోకి రాగానే వెంకటగిరిలోని ముస్లింల ప్రార్థనా మందిరాల అభివృద్ధికి కృషిచేస్తామని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ హామీ ఇచ్చారు. ఆయన తనకు మార్తె, టీడీపీ అభ్యర్థి లక్ష్మీసాయిప్రియ, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి గంగోటి నాగేశ్వరరావులతో కలిసి శుక్రవారం సాయంత్రం పట్టణంలోని జామియా మసీదులో ముస్లింలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. మతపెద్దలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పులికొల్లు రాజేశ్వరరావు, బీరం రాజేశ్వరరావు. కేవీకే ప్రసాద్ నాయుడు, శ్రీరాందాస్ గంగాధర్, పప్పు చంద్రమౌళిరెడ్డి, పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, మంకు ఆనంద్, మల్లారం బాబు, చంద్రారెడ్డి, మల్లి, ముస్లిం పెద్దలు బాబూలాల్, ఖరీముల్లా, గౌసబాయ్, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు హేమంత్ చౌదరి, చంటి, నాని, విష్ణు పాల్గొన్నారు.

పెరిగిన ముత్యాలమ్మ హుండీ ఆదాయం

చిల్లకూరు, ఏప్రిల్ 5: ముత్యాలమ్మ జాతర సందర్భంగా హుండీ రాబడి గత ఏడాది కంటే పెరిగినట్లు ఆలయ ఈవో నవీన్‌కుమార్ తెలిపారు. శుక్రవారం అమ్మవారి ఆలయంలో హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారికి సమర్పించిన దున్నపోతుల వేలం పాటల ద్వారా గతేడాది దున్నపోతులకు రూ.13,30,000లు రాగా ఈ ఏడాది రూ. 19,35,000 వచ్చిందన్నారు. ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా గతేడాది రూ.10,82,350 రాగా ఈ ఏడాది రూ. 11,05,110లు వచ్చిందన్నారు. ముత్యాలమ్మ హుండీ ద్వారా గతేడాది రూ. 23,84,185 ఆదాయం రాగా ఈ సారి రూ.23,20,863లు వచ్చిందన్నారు. పోలేరమ్మ హుండీ ద్వారా గతేడాది రూ.6,14,547లు ఈ ఏడాది రూ.5,61,974లు వచ్చిందన్నారు. మొత్తంమ్మీద గతేడాది రూ.54,11,082 ఆదాయం వస్తే ఈ ఏడాది రూ.59,22,947 వచ్చిందన్నారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది జాతర సందర్భంగా ఆదాయం రూ.5,11,865 పెరిగిందన్నారు. ఈ కార్య క్రమంలో ట్రస్టుబోర్డు చైర్‌పర్సన్ ఇంద్రసేనమ్మ, సభ్యుడు చంద్రశేఖర్‌రెడ్డి, సిబ్బంది సురేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సూపర్-6 పథకాలతో అభివృద్ధి, సంక్షేమం


కరపత్రాలు పంపిణీ చేస్తున్న సంధ్యారాణి

గూడూరు, ఏప్రిల్ 5: ఉమ్మడి ప్రభుత్వం అధికా రంలోకి వస్తే అమలు చేయనున్న సూపర్-6 పథకాలతో పేదల ఆర్థిక అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ సతీమణి సంధ్యారాణి అన్నారు. శుక్రవారం స్థానిక 20వ వార్డులో సూపర్-6 పథకాలపై ఇంటింటా ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో శీలం కిరణ్ కుమార్, పులిమి శ్రీనివాసులు, వీరుబోయిన వెంకటేశ్వర్లు, నటశేఖర్, నరేష్, మునీంద్ర, వల్లూరు మోహన్, రవీంద్రబాబు, నరసింహులు, తిరుపాల్, రత్నం, తీగల చంద్రశేఖర్, ఇంద్రవర్ధన్ పాల్గొన్నారు.

వెలికంటికి టీడీపీ అభ్యర్థి పరామర్శ



డక్కిలి, ఏప్రిల్ 5 : వైసీపీ సీనియర్ నాయకులు, జిల్లా సెంట్రల్ బ్యాంకు డైరెక్టర్ వెలికంటి రమణారెడ్డిని శుక్రవారం రాత్రి ఆయన నివాసంలో వెంకటగిరి టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ, మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పరామర్శించారు. ఈ ఎన్నికల్లో తమకు మద్దతు ఇవ్వాలని కోరారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. వారి వెంట టీడీపీ నాయకులు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, రాజేశ్వరావు ఉన్నారు.

వెంబులూరులో వైసీపీకి షాక్

● టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు
● రానుంది ఉమ్మడి ప్రభుత్వమే : కురుగొండ్ల

డక్కిలి, ఏప్రిల్ 5 :వెంబులూరులో వైసీపీకి షాక్ తగిలింది. శుక్రవారం వెంబులూరు పంచాయితీ నుంచి పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున టీడీపీలో చేరారు. టీడీపీలో చేరిన వారిలో పాయశం ప్రభాకర్, ఆలూరు దామోదర నాయుడు, పాయశం కోటేశ్వరరావు, పూల వెంకటేశ్వర్లు, గాలి సుబ్బయ్య, శంకరయ్య, లక్కాకుల కోటేశ్వరావు, పాయశం కోటయ్య, దాసర ఇహరిబాబులు ఉన్నారు. వీరందరికీ మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగోటి నాగేశ్వరరావులు పసుపు కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ వచ్చే ఎన్నికలు అవినీతికి, అభివృద్ధికి మధ్యే పోటీ అని అన్నారు. అభివృద్ధి కోరుకొనే వారంతా తెలుగుదేశం పార్టీకి ఓటు వేయాలని విజ్ఞప్తిచేశారు. వెంకటగిరి టీడీపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియను గెలిపిస్తే నియోజకవర్గం అన్ని విధాలా అభివృద్ధి చేస్తారని చెప్పారు. టీడీపీ నాయకులు ఏలేశ్వరం రామచంద్రయ్య నాయడు, పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, చెలికం భాస్కరరెడ్డి, పీపీ చౌదరి, పోకూరు రమేష్, పాయశం గోపాల్, పోట్టా మునెయ్య, చింతమాను పెంచలయ్య, చింతమాను వెంకటపతి పాల్గొన్నారు.


వైసీపీ వారిని టీడీపీలోకి ఆహ్వానిస్తున్న కురుగొండ్ల

8 మంది వలంటీర్ల రాజీనామా

కోట, ఏప్రిల్ 5 : కోట పట్టణంలోని 3 సచివాలయాలకు సంబంధించి 8 మంది గ్రామ వలంటీర్లు తమ పోస్టులకు శుక్రవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఎంపీడీవో శంకరయ్యకు అందజేశారు.

50 మద్యం బాటిళ్ల పట్టివేత

కోట, ఏప్రిల్ 5 : మండల పరిధిలోని గూడలి గ్రామానికి చెందిన తోటకూరు మణి శుక్రవారం బెల్టు దుకాణానికి తరలిస్తున్న 50 మద్యం బాటిళ్లను గూడలి వద్ద ఎస్‌ఐ నాగబాబు పట్టుకున్నారు. అతడి ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు.

కుక్కల దాడిలో జింక మృతి



కోట, ఏప్రిల్ 5 : మండల పరిధిలోని చంద్రశేఖరపురం వద్ద శుక్రవారం కుక్కల దాడిలో రెండేళ్ల ఆడ జింక మృతి చెందింది. స్థానికుల కథనం మేరకు.. మండల పరిధిలోని కేశవరం, కొండుగుంట అడవుల నుంచి దాహార్తిని తీర్చుకునేందుకు రెండేళ్ల జింక చంద్రశేఖరపురం వైపు వచ్చింది. స్థానికంగా ఉన్న కుక్కలు ఆ జింకను వెంబడించడంతో ఊరి పొలిమేరల్లో ఉన్న ఇనుపకంచెలో ఇరుక్కుపోయింది. ఆ సమయంలో కుక్కలు దాడిచేశాయి. దీంతో అది మృతి చెందింది. స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి జింకను కేశవరం అడవుల్లో దహనం చేశారు.

సంగమేశ్వరుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

కోట, ఏప్రిల్ 5 : కోట మండలం గూడలిలోని కామాక్షిదేవి సమేత సంగమేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. 11 రోజులపాటు జరిగే స్వామివారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేసి ప్రారంభించారు. ఆలయ ప్రధానార్చకుడు కార్తీక్‌స్వామి ఆధ్వర్యంలో సంగమేశ్వరస్వామికి పలు అభిషేకాలు చేసి విశేష అలంకరణలో ఉంచారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలతో గూడలి పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు.

వైసీపీ నేతలు టీడీపీలో చేరిక



బాలాయ పల్లి, ఏప్రిల్‌: బాలా య పల్లి పంచాయతీకి చెందిన వైసీపీ నేతలు బొల్లినేని యుగంధర్ నాయుడు, గుండుబోయిన రమణయ్య యాదవ్ శుక్రవారం టీడీపీలో చేరారు. టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ వారికి పసుపు కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వా నించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు చంద్రబాబుపై ఆధారపడి ఉందని భావించి పార్టీలో చేరామన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు మస్తాన్ నాయుడు, సత్యంనాయుడు, శ్రీహరి, రామచంద్ర నాయుడు, వెంకటక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

అక్కా..! పోయి వస్తానే...

● ముగిసిన ముత్యాలమ్మ జాతర


పోలేరమ్మ గ్రామోత్సవంలో జనసందోహం


పోలేరమ్మ వెళ్లనంపు గ్రామోత్సవం

చిల్లకూరు, ఏప్రిల్ 5: అక్కా...! పోయి వస్తానే... మళ్ళీ వచ్చే ఏడాది వస్తానే... అంటూ పోలేరమ్మ తన సోదరి ముత్యాలమ్మకు చెప్పి నిమజ్జనానికి బయలుదేరగా భక్తులు చీరలు పరిచి సాష్టాంగ నమస్కారాలతో సాగనంపారు. ముత్యాలమ్మ జాతరలో ఆఖరి ఘట్టమైన పోలేరమ్మ వెళ్లనంపు కార్యక్రమం శుక్రవారం వైభవంగా జరిగింది. చిల్లకూరు మండలం తూర్పుకనుపూరులో నాలుగు రోజులు పాటు అత్యంత వైభవంగా జరిగిన జాతర ముగిసింది. గంగమిట్ట మీద కొలువుదీరిన పోలేరమ్మకు వేకువ జామున కుంభం పోసి నైవేద్యం సమర్పించారు. అనంతరం పోలేరమ్మ జాతర ముగుస్తున్నట్లు గణాచారి ప్రకటించారు. అనంతరం పోలేరమ్మ వెళ్లనంపు కార్యక్రమంలో భాగంగా పోలేరమ్మ విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించారు. వీధుల్లో మహిళలు చీరలు పరిచి అమ్మవారిని చీరలపై సాగనం పారు. గ్రామోత్సవం నిర్వహిం చిన అనంతరం పోలేరమ్మ తన సోదరి ముత్యాలమ్మను అక్కా వెళ్లివస్తానంటూ పలక రించే ఘట్టం భక్తులను ఆకట్టు కుంది. ముత్యాలమ్మ ఆలయంలో పోలేరమ్మ విగ్రహాన్ని ఉంచి గణాచారి ముత్యాలమ్మకు ప్రత్యే క పూజలు జరిపారు. తర్వాత ఊరి చివర మైదానంలోకి పోలేరమ్మను తీసుకెళ్లి అక్కడ పంబలోళ్లు డప్పు వాయిస్తుండగా ఆసాదులు పోలేరమ్మ కథను భక్తులకు వినిపించారు. ఈ సందర్భంగా పలువురు మహిళా భక్తులకు అమ్మవారు రావడంతో చిందులు వేస్తూ వచ్చే ఏడాది వస్తానంటూ చెబుతారు. గణాచారి ఆ మహిళా భక్తులపై పసుపునీళ్లు చల్లి దీవెనలు అందజేయడంతో జాతర ముగిసింది. ఆలయ ఈవో నవీన్‌కుమార్ ఏర్పాట్లను పర్య వేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి బందోబస్తు నిర్వహించారు.

స్తంభించిన వాహనాలు..

జాతర ముగియడంతో గమ్యస్థానాలకు చేరుకునే భక్తులు ఒక్కసారిగా వెనుదిరగడంతో తూర్పుకనుపూరులో ట్రాఫిక్ స్తంభించింది. వాహనాలు బారులు తీరడంతో పలు చోట్ల ట్రాఫిక్ నిలిచిపోయింది. తూర్పుకనుపూరు శివారు, బల్లవోలు, చింతవరం, కోట మార్గంలో ఉత్తమ నెల్లూరు, సిద్దవరం గ్రామాల వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

జాతరలో ఘర్షణ


గాయపడిన శివ

మండలంలోని తూర్పు కనుపూరు గ్రామంలో జరిగిన ముత్యాలమ్మ జాతరలో శుక్రవారం రెండు గ్రామాలకు చెందిన వారి మధ్య ఘర్షణ జరిగింది. స్థానికుల కథనం మేరకు... తూర్పు కనుపూరు గ్రామానికి చెందిన పలువురికి, కోట మండలం కొత్తపట్నం గ్రామానికి చెందిన పలువురికి దర్శనం విషయమై స్వల్ప వివాదం చోటు చేసుకుంది. వివాదం కాస్త ఘర్షణకు దారి తీయడంతో కొత్తపట్నం గ్రామానికి చెందిన పలువురు తూర్పుకనుపూరు గ్రామానికి చెందిన ఒబ్బాయి శివపై దాడి చేశారు. ఆయనకు రక్తగాయాలయ్యాయి. అలాగే శివకు చెందిన సత్రం తలుపులు సైతం పగలగొట్టారు. గాయపడిన శివను గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యంకోసం చెన్నైకు వెళ్లాడు.

దుర్మార్గ పాలనను అంతమొందించాలి


కరపత్రాలు పంపిణీ చేస్తున్న పాశిం సునీల్‌కుమార్

గూడూరు, ఏప్రిల్ 5: రాష్ట్రంలో సాగుతున్న దుర్మార్గపు పాలనను రానున్న ఎన్నికలలో అంతమొందించాలని మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని కుంద కూరు, నెర్నూరు గ్రామా లలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం అథోగతిపాలైందన్నారు. దోచుకోవడమే ధ్యేయంగా పాలన సాగించారన్నారు. అన్నిరంగాల్లో రాష్ట్రం వెనుకబడిందన్నారు. గాడితప్పిన రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపించాలన్నా, అన్నివర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమవుతుందన్నారు. రానున్న ఎన్నికలలో ఉమ్మడి కూట మిని గెలిపించాలన్నారు. పలువురు నాయకులు టీడీపీలో చేరారు. వారికి పసుపు కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నెలబల్లి భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు రాజు, దుద్దా రాఘవరెడ్డి, రాధాకృష్ణారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, మధురెడ్డి, మట్టం శ్రావణి, శ్రీనివాసులు, నాగేశ్వరరావు, బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ముస్లింలకు నిత్యావసరాల పంపిణీ



గూడూరు అర్బన్, ఏప్రిల్ 5: స్థానిక బాలాజీ నగర్‌లోని ప్రగతి సేవాసంస్థ నిర్వాహకులు వారి కార్యాలయంలో శుక్రవారం రంజాన్ పండుగను పురస్కరించుకుని పేద ముస్లింలకు నిత్యావసరాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, జీ చంద్రశేఖర్, శ్రీనివాసులు, నారాయణ, వెంకటేశ్వర్లు, ఇబ్రహీం, రసూల్, కరీముల్లా, రాము, సతీష్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు నిత్యావసరాల పంపిణీ



గూడూరు అర్బన్, ఏప్రిల్ 5: స్థానిక త్యాగరాజవీధిలోని వీరభద్రస్వామి ఆలయంలో శుక్రవారం రెడ్‌సంస్థ ఆధ్వర్యంలో ఇన్నర్‌వీల్‌క్లబ్, ఆంధ్రమహిళా మండలి సహకారంతో దివ్యాంగులకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. విష్ణువందన, జమున, స్నేహలత, లక్ష్మీ, అనిత, పద్మా, జానా సుధీర్, శ్రీనివాసాచారి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి టీడీపీ నాయకుల పరామర్శ



సూళ్లూరుపేట, ఏప్రిల్ 5: మండల పరిధిలోని ఉగ్గుముడి గ్రామానికి చెందిన పోలూరు యోగానంద్ గురువారం బుచ్చినాయుడు కండ్రిగ మండల కారణిమిట్ట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న టీడీపీ జిల్లా కార్యదర్శి వేనాటి సతీష్ రెడ్డి శుక్రవారం ఉగ్గుముడి గ్రామానికి వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

శవ రాజకీయాలు జగన్‌కు అలవాటే: జనసేన


సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

గూడూరు అర్బన్, ఏప్రిల్ 5: ఎన్నికలలో లబ్ధిపొందడానికి శవ రాజకీయాలు చేయడం సీఎం జగన్‌కు అలవాటేనని జనసేన పార్టీ ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్ విమర్శించారు. శుక్రవారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తండ్రి వైఎస్ మరణం, కోడికత్తి డ్రామా, వివేకానంద రెడ్డి హత్య ఘటనలను ఎన్నికలకు వాడుకోవడం జగన్‌కు అలవాటేనన్నారు. ఖజానాలో డబ్బులు లేక పింఛన్లు ఇవ్వలేకపోయారన్నారు. ఆ చేతగాని పాలనను కప్పి పుచ్చుకోవడానికి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిపై దుష్ప్రచారాలు చేయడం దుర్మార్గమన్నారు. ఇకనైనా శవరాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. ఈ హత్యా రాజకీయలను జనం గమనించారని రానున్న ఎన్నికలలో జగన్‌కు బుద్ధిచెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇంద్రవర్ధన్, విజయ్, అవినాష్, వసంత్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ రోడ్డు కబ్జాకు యత్నం

అడ్డుకున్న గ్రామస్తులు ● తిరిగి చదును చేసిన కబ్జాదారుడు


భూస్వామిపై చర్యలు తీసుకోవాలంటూ నినాదాలు చేస్తున్న గ్రామస్తులు

కోట, ఏప్రిల్ 5 : కోట మండలం తిన్నెలపూడి వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డును ఓ భూస్వామి శుక్రవారం కబ్జా చేసే ప్రయత్నం చేయగా గ్రామస్తులు అడ్డుకున్నారు. వెంకన్నపాళెం నుంచి తిన్నెలపూడి గ్రామంలోకి సుమారు 2.5 కిలోమీటర్ల రోడ్డు ఉంది. ఈ రోడ్డును వెంకన్నపాళెంకు చెందిన ఓ భూస్వామి జేసీబీ, డోజర్‌తో రోడ్డును పెకిలించి తన పొలంలో కలిపేసుకునే ప్రయత్నం చేస్తున్నాడు. అంతేగాకుండా రోడ్డు పక్కనే విద్యుత్ మెయిన్ లైన్ స్తంభాలను తొలగించేందుకు యత్నించాడు. సమాచారం తెలుసుకున్న స్థానిక నాయ కురాలు గండవరం సుష్మారెడ్డి, సురేంద్రరెడ్డి, పెంచలయ్య, స్థానిక సర్పంచ్ హుటాహుటిన ఆక్రమిత స్థలికి చేరుకున్నారు. తక్షణం కబ్జా పనులు ఆపకపోతే దీక్షలకు దిగుతామని హెచ్చరించారు. మూకుమ్మడిగా గ్రామస్తులంతా పనులను అడ్డుకున్నారు. దీంతో వివాదం నెలకొంది. ఎట్టకేలకు భూ స్వామి తాను తవ్వినరోడ్డుకు మట్టి తోలిస్తానని గ్రామస్తులకు హామీ ఇచ్చాడు. ఇప్పుడే చేయాలని పట్టుబట్టడంతో వెంటనే మళ్లీ రోడ్డును యథావిధిగా చదునుచేశారు.

టీడీపీ విజయాన్ని ఎవరూ ఆపలేరు : నెలవల


బాపూజీ వీధిలో ప్రచారానికి వెళ్తున్న పార్టీ నాయకులు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 5: రాష్ట్రంలో టీడీపీ ప్రభంజనాన్ని ఎవరూ ఆపలేరని మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యం అన్నారు. శుక్రవారం సూళ్లూరుపేటలోని బాపూజీ వీధిలో టీడీపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఉమ్మడి టీడీపీ అభ్యర్థి నెలవల విజయశ్రీ విస్తృతంగా ప్రచారం చేపట్టారు. స్థానిక టీడీపీ కార్యాలయం నుంచి మాజీ మంత్రి పరసా వెంకటరత్నం, టీడీపీ జిల్లా కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, జనసేన ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఇంటింటా తిరిగి టీడీపీ సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. టీడీపీ అభ్యర్థిని గెలిపించాలని అభ్యర్థించారు. పార్టీ కార్యాలయం నుంచి బజారు వీధిలో పాండురంగ ఆలయం మీదుగా గాండ్ల వీధి వరకు ప్రచారం చేశారు. రాష్ట్రంలో అరాచక పాలనపోయి ప్రజాపాలన రావాలంటే మళ్లీ టీడీపీ అధికారంలోకి రావాలన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధికసంఖ్యలో విచ్చేసి బ్రహ్మరథం పట్టారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవనాయుడు, బీసీ నాయకులు చిట్టేటి పెరుమాల్, మెస్ రమణయ్య, బండారు ఆంజనేయులు, అలవల శ్రీనివాసులు, వాకచర్ల రమేష్, జనసేన నాయకులు పొన్నా కాటయ్య తదితరులు పాల్గొన్నారు.

బాబు జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

గూడూరు, ఏప్రిల్ 5: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్‌రామ్ అని ఎమ్మార్పీఎస్ నాయకులు గోవింద శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం స్థానిక అరుంధతీయ పాళెంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బాబుజగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రమణయ్య, శివయ్య, మీరయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరిటౌన్: భారత మాజీ ఉప ప్రధాని, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని స్థానిక 9వ బెటాలియన్‌లో అడిషనల్ కమాండెంట్ పీ.అరుణ్ బోస్ నిర్వహించారు. బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

వెంకటగిరి: యువత బాబూ జగ్జీవన్‌రామ్‌ను ఆదర్శవంతంగా తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పిలుపు నిచ్చారు. శుక్రవారం పట్టణంలోని కాశీపేట కూడలిలో ఏర్పాటు చేసిన బాబూజగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

డక్కిలి: డక్కిలిలో టీడీపీ ఆధ్వర్యంలో బాబూ జగ్జీవన్‌రామ్‌కు అంజలి ఘటించారు. అలాగే కమ్మపల్లి రోడ్డు సెంటరులోదళితనాయకుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో బాబూ జగ్జీవన్‌రామ్‌కు అంజలి జరిగాయి. టీడీపీ నాయకులు ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, చెలికం భాస్కరరెడ్డి, రత్నం, ప్రభాకర్, పిపి చౌదరి, పోకూరు రమేష్, డక్కిలి చంద్రారెడ్డి పాల్గొన్నారు.

తడ: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు సయ్యద్ ఇక్బాల్, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ఆమోస్‌బాబు, గృహనిర్మాణశాఖ కార్యాలయంలో ఏఈ సత్యనారాయణ, ఎంఈవో మల్లికార్జున్‌రావు తదితరులు బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటాన్ని ఉంచి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బాలాయపల్లి: స్థానిక టీడీపీ కార్యాలయంలో బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రాయి మస్తాన్ నాయుడు, రాయి సత్యంనాయుడు, కూను శ్రీహరి, తాళ్లూరు ప్రసాద్ నాయుడు పాల్గొన్నారు.

పెళ్లకూరు: పెళ్లకూరు విద్యావనరుల కేంద్రంలో బాబు జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పించారు. ఎంఈవో మించల శంకరయ్య ఉపాధ్యాయులు మురళి, చెంచురాజ, శ్రీహరి, రవి తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట: భారతదేశం ఉప ప్రధాని బాబుజగ్జీవన్‌రామ్ చేసినసేవలు ఎనలేనివని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. నాయుడుపేట అంబేడ్కర్ విగ్రహం వద జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.





బాబు జగ్జీవన్‌రామ్‌కు గూడూరులో ఎమ్మార్పీఎస్ నాయకులు, డక్కిలిలో టీడీపీ నేతలు, వెంకటగిరిలో అరుణ్‌బోస్, బాలాయపల్లెలో టీడీపీ నాయకుల నివాళి